



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 286 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 23 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 286 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 23 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur





## లండన్ యూనివర్సిటీని సందర్శించిన
# సీఎం రేవంత్ రెడ్డి

- ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తెలంగాణకు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం లండన్ యూనివర్సిటీని సందర్శన
- హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుపై లండన్ వర్సిటీ ప్రతినిధులతో చర్చ
- అంతకుముందు కేంబ్రిడ్జ్ వర్సిటీ ప్రతినిధులతో విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై సమావేశం
- హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు అందించాలని సీఎం విజ్ఞప్తి
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానం

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణకు ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం లండన్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణలో ఉన్న అవకాశాలపై ఆ వర్సిటీ ప్రతినిధులతో సీఎం బృందం చర్చించింది. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుకు ఆలోచిస్తున్నట్లుగా లండన్ వర్సిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి కేంబ్రిడ్జ్ వర్సిటీకి వెళ్లారు. ఆ వర్సిటీ ప్రతినిధులతో సమావేశమై విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను వివరించారు. రాజధాని నగరాన్ని ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తమ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్‌కు చెందిన ప్రొఫెసర్లు జయదీప్ ప్రభ్, వెంకట శిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.



## భూభారతిపై సిట్టింగ్ జడ్జితో
# విచారణ జరిపించాలి

- భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కిషన్ రెడ్డి డిమాండ్
- 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణ
- బీఆర్ఎస్ హయాంలో వేలాది ఎకరాలు.. కాంగ్రెస్ హయాంలో లక్షలాది ఎకరాలు నిషేధిత జాబితాలోకి వెళ్లాయని విమర్శ
- ప్రైవేటు భూములను రాత్రికి రాత్రే 22ఏ జాబితాలో చేరుస్తున్నారని ఆరోపణ
- భూముల వ్యవహారంలో బీజేపీ లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోందని వెల్లడి
- బీజేపీ అధికారంలోకి వస్తే భూములపై మళ్లీ పరిశీలన చేస్తామని ప్రకటన


హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో

- మిగతా 2లో

## గచ్చిబౌలిలో కూలిన
# ఏడంతస్తుల భవనం..
## ఇద్దరు మృతి



- గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న భవనం
- ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు కార్మికులు మృతి
- అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్లు గుర్తింపు
- క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు





## అక్రమ భవనాలన్నీ
# కూల్చేస్తాం
### హైడ్రా కమిషనర్

- గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి మృతి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్
- అంజయ్యనగర్‌లోని అక్రమ కట్టడాలన్నింటినీ కూల్చేస్తామని ప్రకటన
- సెట్‌బ్యాక్‌లు లేని భవనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. శిథిలాల కింద నుంచి వారి మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే (34), మోపత్ (42)గా గుర్తించారు.

- మిగతా 2లో




# బీజేపీ కొత్త టీమ్‌తో
# ప్రధాని మోదీ భేటీ

- ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని 'యువ సంవాద్' కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష
- 'వందేమాతరం'పై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ బీజేపీ తీర్మానం

- మిగతా 2లో

## రూ.7,000 కోట్లతో కొత్త
# ఎల్‌పీజీ పైప్‌లైన్లు..
### తెలంగాణకు ప్రయోజనం



- రూ.7,000 కోట్లతో ఎల్‌పీజీ పైప్‌లైన్ విస్తరణకు కేంద్రం ఆమోదం
- తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం
- దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం
- ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్
- తగ్గనున్న రవాణా ఖర్చులు, ప్రమాదాల ముప్పు

హైదరాబాద్ పెన్ పవర్:దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ

- మిగతా 2లో

# యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 సీజన్ 2
## పోస్టర్ ఆవిష్కరించిన దిల్ రాజు.. ఫస్ట్ ప్రైజ్ రూ.3 లక్షలు!

హైదరాబాద్ పెన్ పవర్::తెలంగాణ సంస్కృతి, పండుగలు, చరిత్రను తమ కెమెరాతో ప్రపంచానికి చూపించాలనుకునే యువ ఫిల్మ్ మేకర్స్‌కు అదిరిపోయే అవకాశం . బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 – సీజన్ 2' నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. యువతలోని సృజనాత్మకతకు పదును

- మిగతా 2లో





# నన్ను, నా కుటుంబాన్ని
# టార్గెట్ చేశారు..
## మంత్రి కొండా సురేఖ లేఖ

- అవమానకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీకి విజ్ఞప్తి
- విచారణ జరుగుతున్న సమయంలో తనపై బహిరంగ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్య
- కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని మల్లు రవి సూచన
- సురేఖ వివరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసిన మల్లు రవి

- మిగతా 2లో

# రూ.150కోట్ల నగదు బదిలీ..
### మరో వివాదంలో బీసీసీఐ చైర్మన్




పెన్ పవర్ డెస్క్: నల్సార్ విశ్వవిద్యాలయానికి సంబం ధించి ఓ నిర్ణయంతో ఇటీవల వార్తల్లో నిలిచిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర మరో వివాదంలో చిక్కుకున్నారు. మిశ్ర ఆధ్వర్యంలో బీసీఐలో ఆర్థిక అవకతవకలు, అనుమానాస్పద

- మిగతా 2లో

## సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

- ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో వివాదం
- ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో విడుదల చేయాలని డిమాండ్
- నిర్మాతల మండలి కీలక ప్రకటన, షూటింగ్‌లకు ఇబ్బంది లేదు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఆశలు వదులుకోండి!

### చినుకు లేదు.. సేద్యం నడవదు... అరక సాగేదెలా?

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఈరోజు వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావం కారణంగా మోస్తరు నుంచి తేలిక పాటి జల్లులు పడతాయని పేర్కొంది. రానున్న రెండు రోజుల పాటు కొన్ని చోట్ల ఆకాశం మేఘా వృతమై ఉంటుందని, మరికొన్ని చోట్ల మోస్తరు వానలు, ఇంకా కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి జల్లులు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. గంటకు ముప్పయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా తెలిపింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ శాఖ స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావంతో వానలు పడటం లేదు. వర్షపాతం తక్కువగా నమోదయింది. దీంతో సాగుకు ఇబ్బందికరంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతాంగానికి నిరాశను మిగిల్చింది. ఇక భారీ వర్షాలు పడటం కూడా కష్టమేనని అంచనాలు వినిపిస్తున్నాయి.

**మోస్తరు వానలు...**

ఆంధ్రప్రదేశ్ లో నేడు మోస్తరు నుంచి తేలిక పాటి వానలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర, యానాం మరియు రాయలసీమలోని పలు ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు లేదా జల్లులు పడే అవకాశం ఉంది. తీర ప్రాంతాలలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చుఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు ప్రజలు చెట్లు లేదా విద్యుత్ స్తంభాల కింద నిలబడవద్దని అధికారులు సూచించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షపాతం 20 శాతం తక్కువగా నమోదయింది. మరొకవైపు పిడుగు పాటు హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది. మత్స్యకారులు మూడు రోజుల పాటు చేపల వేటకు వెళ్లవద్దని సూచించింది. సముద్రం అలల ఉధృతి ఎక్కువగా ఉంటుందని చెప్పింది.

**తేలికపాటి వానలు....**

తెలంగాణలోని కొన్ని జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉంది. రైతులు, పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. తెలంగాణలోనూ ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఆరు తడి పంటలను వేయాలని మాత్రమే వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే సూచించారు. గోదావరి ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో ఉన్న వారు తప్పించి మిగిలిన చోట్ల వరి వేయకపోవడమే మంచిదని, వరి వేసి నష్టపోవద్దని అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద రెండు తెలుగు రాష్ట్రాలను ఎల్ నినో కుదిపేస్తుంది.

# గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం.. ఇద్దరు మృతి

- మొదటి పేజి తరువాయి

నిర్మాణం పూర్తయి అద్దెలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం ఈ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా కూలిపోయింది. శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌పై పడటంతో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఆ అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్‌మెంట్ గోడలు ధ్వంసం కావడంతో అందులో ఉన్నవారు బయటకు వెళ్తున్నారు. అలాగే, పక్కనే ఉన్న ఓ హాస్టల్ విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ సిబ్బంది.. ఇంకా శిథిలాల కింద ఎవరైనా చిక్కుకొని ఉన్నారేమోనన్న అనుమానంతో సహాయక చర్యల్ని ముమ్మరం చేశారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే మాత్రం ప్రాణ నష్టం అధికంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలిని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

**బిల్డర్ కోసం గాలింపు!**

జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా భవనం నిర్మించారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. సరైన ప్రమాణాలు లేకుండా తక్కువ వ్యవధిలోనే నిర్మించడంతో నిర్మించడంతో పేకమేడలా కూలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు, ఈ భవనం నిర్మాణం చేస్తున్న బిల్డర్ సాజిద్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

**గచ్చిబౌలి విషాదం.. అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం: హైడ్రా కమిషనర్**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు.కేవలం 50 గజాల స్వల్ప విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏడంతస్తుల భవనాన్ని నిర్మించడమే కాకుండా, దానిపై అదనంగా పెంట్‌హౌస్‌ను కూడా నిర్మించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బిల్డర్ సాజిద్ నిర్మించే భవనాలన్నీ అత్యంత నాసిరకంగా ఉంటాయని స్థానికులు ఆరోపిస్తున్నట్లు కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు.అంజయ్య నగర్ ప్రాంతంలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయని, కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా పాటించకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారని రంగనాథ్ పేర్కొన్నారు. నాలాలను ఆక్రమించి ఇష్టారాజ్యంగా కట్టడాలు చేపట్టారని, వీటిలో అధిక శాతం ప్రస్తుతం హాస్టళ్లుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఆయా భవనాలను యజమానులు వెంటనే ఖాళీ చేయాలని ఆయన ఆదేశించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన అన్ని భవనాలను కూల్చివేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

# భూభారతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- మొదటి పేజి తరువాయి

అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

"రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమీషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమీషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ

పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయి" అని కిషన్ రెడ్డి అన్నారు.

# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

- మొదటి పేజి తరువాయి

మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది.ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు.

ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి.

ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు.అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

**'వందేమాతరం'పై బీజేపీ తీర్మానం**

ఇదే సమయంలో, 'వందేమాతరం' గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

# రూ.150కోట్ల నగదు బదిలీ.. మరో వివాదంలో బీసీఐ ఛైర్మన్

- మొదటి పేజి తరువాయి

నియామకాలు చోటుచేసుకున్నాయని కో-ఛైర్మన్ వై.ఆర్ సదాశివరెడ్డి ఆరోపించారు. కౌన్సిల్ అను మతి లేకుండా ఆయన బంధువులకు నియామ కాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అధికారాలను దుర్వినియోగం చేసినందుకు గాను 15 రోజుల్లోగా పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కోరారు.

**ప్రైవేట్ ట్రస్ట్‌కు రూ.150కోట్ల బదిలీ**

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బీసీఐ ట్రస్ట్‌ను మనన్‌కుమార్ మిశ్ర పని చేయకుండా అడ్డుకున్నారని.. దాని స్థానంలో 2020లో 'బీసీఐ ట్రస్ట్ పెరల్ ఫస్ట్' అనే కొత్త ట్రస్ట్‌ను నమోదు చేశారని సదాశివరెడ్డి ఆరోపించారు. బీసీఐ నిధుల నుంచి రూ.150 కోట్లను ఈ ట్రస్ట్‌కు బదిలీ చేయడానికి ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ట్రస్ట్‌కు విరాళాలు ఇవ్వాలని.. దీజ× నుంచి గుర్తింపు, పునరుద్ధరణను కోరిన లా కళాశాలలను డిమాండ్ చేసేవారని ఆరోపించారు. చట్టబద్ధమైన నిధులను ప్రైవేట్ ట్రస్ట్‌కు బదిలీ చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

బీసీఐ సిబ్బందిలో ఎక్కువ మంది మనన్‌కుమార్ మిశ్ర కుటుంబ సభ్యులు, ఆయనతో వ్యక్తిగత సంబంధాలు ఉన్నవారేనని సదాశివ పేర్కొన్నారు. వారి నియామకాలను సమర్థించేలా ఎంపిక కమిటీలు.. మెరిట్ జాబితాల రికార్డులు కౌన్సిల్ వద్ద లేవన్నారు. నిధులు, నియామకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**ఎన్నుకున్నందువల్లే పదవిలో ఉన్నా..**

తనపై వస్తున్న ఆరోపణలపై బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర స్పందించారు. బీసీఐ పార్లమెంట్ చట్టం కింద ఏర్పడిందని.. ఛైర్మన్ పదవీకాలంపై ఆ చట్టం ఎలాంటి పరిమితిని విధించలేదని పేర్కొన్నారు. ఆ చట్ట ప్రకారమే ఆరుసార్లు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యానని తెలిపారు. పదవి నుంచి వైదొలగే సమస్యే లేదన్నారు.

# నన్ను, నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు..

హైదరాబాద్: టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ మరో లేఖ రాశారు. తనను, తన కుటుంబాన్ని కొందరు లక్ష్యంగా చేసుకున్నారన్నారు. తనను లక్ష్యంగా చేసుకొని అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తుల్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవిని కోరారు. కమిటీ నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని, అయినా పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని, దీన్ని కమిటీ పరిశీలించాలని కోరారు.

**కుమార్తె మాటల్ని సురేఖ ఖండించాలి: మల్లు రవి**

మరోవైపు, మంత్రి సురేఖ లేఖ రాయడానికి ముందు ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పందించారు. సురేఖ ఇచ్చిన వివరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కుమార్తె వ్యాఖ్యలను ఒక మంత్రిగా ఆమె ఖండించాలని సూచించారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం తనకు సంబంధం లేదని సురేఖ చెబుతున్నారన్నారు. సురేఖ వివరణపై ఎప్పుడు చర్యలు తీసుకుంటామో చెప్పలేమన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె వ్యాఖ్యలపై కొండా సురేఖ వివరణ చూశామని తెలిపారు. "ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాటల వీడియో కూడా పరిశీలించాం.. ఆయన ఇచ్చిన వివరణను సైతం కమిటీ పరిశీలించింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో ప్రొసీజర్ ప్రకారం వెళ్తాం.. రాజగోపాల్ రెడ్డిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు.. వ్యాఖ్యలపై సుమోటోగా తీసుకోవాలా? లేదా?అనేది పరిశీలిస్తున్నాం" అని మల్లు రవి ఈ సాయంత్రం మీడియాకు తెలిపారు.

# యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 సీజన్ 2 పోస్టర్ ఆవిష్కరించిన దిల్ రాజు.. ఫస్ట్ ప్రైజ్ రూ.3 లక్షలు!

- మొదటి పేజి తరువాయి

పెట్టడంతో పాటు.. భవిష్యత్ సినీ ప్రయాణానికి ఓ మంచి ప్లాట్‌ఫామ్‌గా ఈ పోటీలు నిలవనున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, టీఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలను ఇతివృత్తాలుగా తీసుకుని షార్ట్ ఫిల్మ్స్, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు దిల్ రాజు తెలిపారు. ఈసారి పోటీలను మరింత విస్తృతం చేస్తూ కొత్తగా జానపద పాటలు, ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోలు, వ్యాసాలు కు కూడా ఈ 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 -- సీజన్ 2' లో అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దిల్ రాజు కోరారు.

**యువతకు సినీ రంగంలో అవకాశాలు..**

ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు.

**రూ.3 లక్షల బంపర్ ప్రైజ్..**

ఈ పోటీల్లో విజేతలకు భారీ నగదు బహుమతులు అందించనున్నారు. ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.1 లక్షగా ప్రకటించారు. మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున కన్సోలేషన్ ప్రైజ్ అందించనున్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు కూడా అందజేస్తారు.

**డెడ్‌లైన్ ఎప్పుడంటే?**

షార్ట్ ఫిల్మ్ నిడివి 3 నిమిషాలకు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. వీడియోలు 4ఖ రిజల్యూషన్‌లో ఉండాలి. ఆసక్తి ఉన్నవారు తమ ఎంట్రీలను 2026 సెప్టెంబర్ 15లోపు youngfilmmakerschallenge@gmail.comకు లేదా 8125834009 వాట్సాప్ నంబర్‌కు పంపాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తెలిపింది.నిపుణులతో కూడిన జ్యూరీ ఉత్తమ ప్రతిభను ఎంపిక చేయనుంది. యువతకు భవిష్యత్‌లో సినీ అవకాశాలకు మార్గం చూపడంతో పాటు తెలంగాణ గొప్పదనాన్ని కొత్త తరానికి, ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా ఈ ఛాలెంజ్ నిలవనుంది. మీ కథ.. మీ కెమెరా.. మీ క్రియేటివిటీ.. చూపించి రూ.3 లక్షల బహుమతి అందుకోండి మరి.

# సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

తమిళ చిత్ర పరిశ్రమలో మరోసారి సంక్షోభం నెలకొంది. ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 1 నుంచి కొత్త సినిమాల విడుదలను నిలిపివేయాలని తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) కీలక నిర్ణయం తీసుకుంది.ఈ వివాదానికి ప్రధాన కారణం.. థియేటర్లలో విడుదలైన సినిమాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ చేసే కాలపరిమితి. సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలోకి రావాలని థియేటర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలు త్వరగా ఓటీటీలో అందుబాటులోకి రావడం వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గుతోందని, తద్వారా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాతలు మాత్రం తమ వాణిజ్యపరమైన వెసులుబాటును కోరుకుంటున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు కొత్త సినిమాలను విడుదల చేయకూడదని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే, ఇది పూర్తిస్థాయి బంద్ కాదని, సినిమా షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం సెప్టెంబర్ నెలతో పాటు ఆ తర్వాత విడుదల కావాల్సిన పలు చిత్రాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్


అరికపూడి గాంధీ, హైడ్రా కమిషనర్, సిఎంసి కమిషనర్..

# సిఎంసి కమిషనర్..! ప్రాణాలు పోతేనే చర్యలా..?




- 50 గజాల్లో 7 అంతస్తులు కట్టే వరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేశారు..?
- ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించిన హైడ్రా కమిషనర్, సిఎంసి కమిషనర్..

- దుండిగల్ సర్కిల్ తరహాలో.. మాదాపూర్ లోనూ నేతల సిఫార్సులు ఉన్నాయా..?
- సిఎంసి వ్యాప్తంగా పత్రికల్లో వస్తే పట్టించుకోవద్దని ఆదేశాలు ఇచ్చారా..?
- కొందరు నాయకుల సిఫార్సులకు సాక్ష్యం ఈ నిర్మాణ ప్రమాదం..

- 50 గజాల్లో 7o1 అంతస్తులకు.. అనుమతి ఎవరిచ్చారు..? సిఫార్సులు ఎవరు చేశారు..?
- నాలా పక్కనే నిర్మాణం టౌన్‌ప్లానింగ్‌కు కనిపించలేదా..? ముడుపులు కప్పేశాయా..?
- ఫిర్యాదులు వస్తే పనులు నిలిపివేశారు సరే..! మళ్లీ ఎలా మొదలయ్యాయి..?
- అక్రమ నిర్మాణాలకు అండగా వ్యవహరించిన ఆ అధికారులపై చర్యలేవి..?
- లంచాలకు మరిగిన టౌన్‌ప్లానింగ్ అధికారులపై సమగ్ర విచారణకు డిమాండ్..?
- ప్రాణనష్టం సంభవిస్తేనే స్పందిస్తారా.? హైడ్రా మున్సిపల్ కమిషనర్‌కు స్థానికుల ప్రశ్నలు..?


కుప్పకూలిన భవన నిర్మాణం..

గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో కుప్పకూలిన ఏడంతస్తుల భవనం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలోని టౌన్‌ప్లానింగ్ వ్యవస్థనే ప్రశ్నించే విధంగా తయారైంది.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం, 300 జీహెచ్ఎంసి డివిజన్‌లను, 3 విభాగాలుగా విభజించినది, ఇలాంటి ప్రమాదకర కట్టడాల కోసమేనా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. లంచాలకు మరిగిన కొందరు అవినీతి అధికారుల చేతివాటానికి ఈ ప్రమాదం ఒక నిదర్శనమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. నిర్మాణంలో అదనపు అంతస్తులు, సెట్‌బ్యాకుల ఆక్రమణ ఎంత ప్రమాదకరమో ఈ ఘటన ఒక గుణపాఠం.. ఈ విషయం తెలిసిన సిఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ అండ్ అన్ని సర్కిల్‌ల డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసినప్పటికీ, ప్రజలను ఏ మేరకు రిస్కులో పెడుతున్నారో, మాదాపూర్ గచ్చిబౌలి ప్రమాద ఘటన ఒక ఉదాహరణ.. పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో భారీ నష్టం వాటిల్లింది..ఇద్దరు మృతి చెందారు.. ఈ ప్రమాదం మరికొన్ని నెలల తర్వాత జరిగి ఉంటే పరిస్థితి ఏంటి..? 7 అంతస్తుల్లో నివసించే ప్రజల పరిస్థితి, ఊహించుకుంటేనే ఆందోళన కరంగా ఉంది.. నాలా పక్కనే నిబంధనలకు విరుద్ధంగా ఏడంతస్తుల భవనం నిర్మిస్తున్నా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ..ఫిర్యాదు వచ్చినా పనులు ఆపకుండా, తిరిగి నిర్మాణం సాగుతుంటే కళ్లుమూసుకున్న అధికారులపై అనేక అనుమానాలు, వ్యక్తం అవుతున్నాయి.. భవనం కూలి ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాతే హైడ్రా, మున్సిపల్ యంత్రాంగం రంగంలోకి రావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..
సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 22:


గచ్చిబౌలిలో కుప్పకూలిన నిర్మాణం.. టాప్ వ్యూ నుండి తీసిన దృశ్యం..

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత గుట్టురట్టు

- హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత రాకెట్ బట్టబయలు
- అక్రమ పాన్ మసాలా యూనిట్‌పై సీజీఎస్టీ అధికారుల దాడులు
- సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లు నిర్ధారణ
- భారీగా ముడిసరుకు, 40 యంత్రాలు స్వాధీనం.. కీలక వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్‌లో భారీ జీఎస్టీ ఎగవేత గుట్టును హైదరాబాద్ సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) అధికారులు రట్టు చేశారు. నగర శివార్లలోని ఒక రేకుల షెడ్డులో రహస్యంగా నిర్వహిస్తున్న పాన్ మసాలా, పొగాకు తయారీ యూనిట్‌పై దాడి చేసి, సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేతను గుర్తించారు. ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్న కీలక వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ యూనిట్‌లో ఎటువంటి అనుమతులు లేకుండానే పాన్ మసాలా, సుగంధ జర్దా వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. తనిఖీల సమయంలో లెక్కల్లో చూపని 40 ప్యాకింగ్ యంత్రాలను అధికారులు కనుగొన్నారు. ఈ ఫ్యాక్టరీలో మొత్తం 56 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ తయారైన సరుకును జీఎస్టీ, హెచ్ఎస్ఎన్ఎస్ సెస్, సెంట్రల్ ఎక్సైజ్ సుంకాలు చెల్లించకుండానే మార్కెట్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.


-4లో

# పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవ్



**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి కొండా సురేఖను గతంలో కాపాడాను.. ఇప్పుడు ఆ అవకాశం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవన్నారు. కొండా సుస్మిత.. గీత దాటి నేరుగా సీఎంపైనే ఆరోపణలు చేశారన్నారు. అనిరుధ్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి అంతగా హద్దులు దాటి మాట్లాడలేదని, వారిద్దరూ సీఎం గౌరవానికి భంగం కలిగించలేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# సిఎంసి కమిషనర్..! ప్రాణాలు పోతేనే చర్యలా..?





కూలిన భవనాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, సిఎంసి కమిషనర్..

## అక్రమ నిర్మాణాలపై నిఘా అవసరం..!

అంజయ్యనగర్ ఘటనతో నగరంలోని ఇరుకైనప్రాంతాల్లో వెలుస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాలపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తక్కువ స్థలంలో ఎక్కువ అంతస్తులు నిర్మించడం, నాలాలు, డ్రైనేజీలకు సమీపంలో కట్టడాలు చేపట్టడం, అవసరమైన సెట్‌బ్యాక్‌లు పాటించకపోవడం వంటి అంశాలపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు..

ఒక భవనం కూలిపోవడం వల్ల పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్ దెబ్బతినడం, పలువురు గాయపడటం ఈ ఘటన తీవ్రతను తెలియజేస్తోంది. భవిష్యత్తులో ఒక అంజయ్యనగర్ లోనే కాకుండా, నగరంలోని ప్రమాదకర నిర్మాణాలన్నింటినీ గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అక్రమ భవనాలపై ప్రత్యేక డ్రైవ్..

అంజయ్యనగర్‌లో ప్రమాదకర భవనాలను గుర్తించేందుకు సీఎంసీతో కలిసి ప్రత్యేక డ్రైవ్ చేపడతామని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. ప్రాంతంలోని భవనాల నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, నిర్మాణ నిబంధనలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించనున్నట్లు తెలిపారు.. నిబంధనలకు విరుద్ధంగా ఉండిప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే భవనాల విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టత ఇచ్చారు.. ప్రమాదకర అక్రమ నిర్మాణాలను తొలగించక తప్పదని స్పష్టం చేశారు..

- 3 పేజి తరువాయి

హైదరాబాద్‌లోని మాదాపూర్ గచ్చిబౌలి పరిధిలోని అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాల ప్రమాదకర స్వరూపం మరోసారి వెలుగులోకివ చ్చింది. నాలాకు ఆనుకుని కేవలం 50 గజాల స్థలంలో నిర్మిస్తున్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. భవనం కూలిన సమయంలో దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌పై పడటంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో అంజయ్యనగర్‌లో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి.. కళ్లముందే కుప్పకూలిన భవనంపై పలువురు ఆవేదన చెందారు.. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఓ 50 గజాలు గల చిన్నపాటి విస్తీర్ణంలో ఏడంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు.. స్థానికుల ప్రకారం.. భవనం నిర్మాణ సమయంలోనే పలు నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి.. ముఖ్యంగా నాలాకు ఆనుకుని నిర్మాణం చేపట్టడంతో పాటు, కేవలం 50 గజాల స్థలంలోనే ఇంత భారీ నిర్మాణాన్ని చేపట్టడంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు..అయితే అనూహ్యంగా ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో పరిస్థితి విషమించింది. భారీ శబ్దంతో భవనం నేలమట్టం కావడం పరిసర ప్రాంతాల ప్రజలు భయంతో పరుగులు తీశారు.. కూలిన భవనం శిథిలాలు పక్కనే ఉన్న జయదర్శిని అపార్ట్‌మెంట్‌పై పడటంతో ఆ భవనంలోని కొంత భాగం దెబ్బతిన్నది..

పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌కు తీవ్ర నష్టం ఏడంతస్తుల భవనం కూలిన ప్రభావంతో పక్కనే ఉన్నఅపార్ట్‌మెంట్ నిర్మాణానికి నష్టం వాటిల్లింది. భవనం దెబ్బతినడంతో అక్కడ నివసిస్తున్న పలువురు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఘటనలో పలువురికి గాయాలు కావడంతో వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు..

## గతంలో ఫిర్యాదు.. అయినప్పటికీ పనులు: సిఎంసి కమిషనర్..

కూలిపోయిన భవనంపై గతంలోనే ఫిర్యాదులు అందిందాయని సీఎంసీ కమిషనర్ సృజన తెలిపారు.. ఫిర్యాదు వచ్చిన సమయంలో నిర్మాణ పనులను నిలిపివేశామని, అయితే ఆ తర్వాత తిరిగి పనులు ప్రారంభించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని వివరించారు..ఈ అంశం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. గతంలో ఫిర్యాదులతో పనులు నిలిపివేసిన భవనంలో తిరిగి నిర్మాణ పనులు ఎలా కొనసాగాయి..? వాటిని ఎవరు అనుమతించారు..? పనులు తిరిగి ప్రారంభమైన విషయం, టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా..?అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి..

## 50 గజాల్లో ఏడంతస్తుల భవనం ఎలా..?

కేవలం 50 గజాల స్థలంలో ఏడంతస్తుల భవన నిర్మాణం చేపట్టడంపై హైడ్రా కమిషనర్ తీవ్రంగా స్పందించారు. నాలాకు ఆనుకుని ఇలాంటి నిర్మాణాలు చేపట్టడం వల్ల, పరిసరాల్లో ఉన్న భవనాల్లో నివసించే ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు.. అంజయ్యనగర్‌లో ఇలాంటి నిర్మాణాలు మరిన్ని ఉన్నాయని, పలువురు భవన యజమానులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సెట్‌బ్యాక్‌లు లేకుండా, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను గుర్తించి పరిశీలిస్తామని చెప్పారు..

## ఘటనా స్థలాన్ని సందర్శించిన 'హైడ్రా-సిఎంసి కమీషనర్'లు..

ప్రమాదం తీవ్రతను గుర్తించిన అధికారులు, సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దింపారు.. శిథిలాల తొలగింపు, ప్రమాద ప్రాంతాన్ని ఖాళీ చేయించడం, భవనంలో చిక్కుకున్నవారి కోసం గాలింపు వంటి చర్యలు చేపట్టారు. హైడ్రా, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సీఎంసీ, పోలీసు సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలను కొనసాగించారు.. ప్రమాద విషయం తెలుసుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సీఎంసీ కమిషనర్ సృజన, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్యతో కలిసి అక్కడి పరిస్థితిని సమీక్షించారు.. భవనం కూలిపోవడానికి గల కారణాలను, అధికారులను అడిగి తెలుసుకున్నారు.. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భవనం నిర్మాణ విధానం, పరిసరాల్లో ఉన్న ఇతర నిర్మాణాల పరిస్థితిపై ఆరా తీశారు.నాలాకు ఆనుకుని ఉన్న నిర్మాణాలను కూడా పరిశీలించారు..

# హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత గుట్టురట్టు

- 3 పేజి తరువాయి

దాడుల్లో భాగంగా రవాణాకు సిద్ధంగా ఉన్న రూ. 76 లక్షల విలువైన సరుకుతో పాటు, 5,500 కిలోల రెడీమేడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 2,015 కిలోల పాన్ మసాలా మిశ్రమం, 810 కిలోల పొగాకు, ప్యాకింగ్ మెటీరియల్‌తో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశారు.పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై 2026 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పన్ను నిబంధనల నుంచి తప్పించుకోవడానికే ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు

అధికారులు భావిస్తున్నారు. పట్టుబడిన స్టాక్, యంత్రాల సామర్థ్యం, పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఆధారంగా మొత్తం పన్ను ఎగవేత రూ. 160 కోట్లుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయగా, ప్రత్యేక ఆర్థిక నేరాల కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ దాడులు..

## లక్ష లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎస్సై




**హైదరాబాద్ పెన్ పవర్:** చందానగర్ పోలీస్ స్టేషన్?లో ఏసీబీ తనిఖీలు జరిగాయి. లక్ష లంచం తీసుకుంటుండగా ఎస్సై రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి దొరికిపోయాడు. రూ.లక్ష లంచం తీసుకుంటున్న ఎస్సై బాలరాజును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఎస్సై బాలరాజుతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు రఘు, రాజ్‌కుమార్ కూడా లంచం తీసుకుంటూ దొరికిపోయారు. లంచం వ్యవహారంపై పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. లంచం తీసుకున్న వ్యవహారంపై ఏసీబీ అధికారులు పూర్తి వివరాలుసేకరిస్తున్నారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.ఏసీబీకి పట్టుబడుతున్నా.. కేసులు నమోదై జైలుకు వెళుతున్నా కొంతమంది పోలీసుల తీరు మారడం లేదు. తమకు సంబంధం లేని వ్యవహారాల్లో తలదూర్చడం, సెటిల్?మెంట్స్ చేయడం, పైసలివ్వనిదే పని చేయకపోవడం పరిపాటిగా మారింది. ఇటీవల కొంతమంది పోలీస్ అధికారులు ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం ఇందుకు నిదర్శనంగా చెప్పవ చ్చు. ఇలాంటి వాళ్ల వల్ల నిజాయితీగా పనిచేసే పోలీసులపై ప్రభావం పడుతుంది.ఎఫ్ఐఆర్ నమోదు, నిందితులకు స్టేషన్ బెయిల్, చార్జ్ షీట్ దాఖలు ఇలా ప్రతి దాంట్లో కొందరు పోలీసులు అందినకాడికి దండుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి పనులు కావాలన్నా సరే.. రిసెప్షన్‌లో స్టేషనరీ ఖర్చులు సహా కోర్టు కానిస్టేబుల్ వరకు అడిగినంతా ఇచ్చుకోవాల్సిందే. ఇలా ప్రతీ పనికి ఓ రేట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బందితో కలెక్షన్ చేయిస్తూ.. మధ్యవర్తులతో సెటిల్?మెంట్స్ చేయిస్తున్నారు.

# పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



సంఘీభావన తెలియజేసిన శ్రీధర్ రెడ్డి

**ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 22:** పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనే న్యాయమైన డిమాండ్‌తో టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం తిరుమలాయపాలెం మండలం సబ్లేడు గ్రామంలో నిర్వహించిన పాదయాత్రకు బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. తొలితరం పాత్రికేయుడు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలంతో పోరాడి అమరుడైన షోయబుల్లా ఖాన్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం

ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ప్రభుత్వం కూడా తెలంగాణ సమాజానికి సేవ చేసిన పాత్రికేయులను మోసం చేశాయి అని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ఉద్యమ పల్లకిని తమ భుజాలపై మోసిన బోయీలు పాత్రికేయులు అని కొనియాడారు. తమ కలాలతో తెలంగాణ ఉద్యమాన్ని రగిలించి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన పాత్రికేయుల పాత్రను ఎవరూ మరువలేరు అని అన్నారు. తెలంగాణ సాధనలో పాత్రికేయులు పోషించిన కీలక పాత్రకు గుర్తింపుగా వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం పాత్రికేయులు పోరాడుతుంటే ప్రభుత్వాలు హామీలతో కాలం వెళ్లదీస్తున్నాయి. అధికారం మారింది కానీ జర్నలిస్టుల సమస్య మాత్రం మారలేదన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా పాత్రికేయుల న్యాయమైన కోరికలను తీర్చలేని పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. మంత్రులు ఉన్నది ప్రజల సమస్యలు పరిష్కరించడానికా? లేక హామీలు ఇవ్వడానికా అని శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. పాత్రికేయులు ఎవరి దయాదాక్షిణ్యాలు కోరుకోవడం లేదని, తాము చేసిన సేవకు ప్రభుత్వం ఇవ్వాల్సిన న్యాయమైన గౌరవం, హక్కు మాత్రమే కోరుతున్నారని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న జర్నలిస్టుల సమస్యను ఇకనైనా ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైన చోట కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశించిన పాత్రికేయులకు కూడా నిరాశే ఎదురైందని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల సమస్యను పరిష్కరించడంలో పాలకుల వైఖరి మారకపోవడం దురదృష్టకరమన్నారు. పాత్రికేయుల న్యాయమైన పోరాటానికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేకపోతే పాత్రికేయుల ఉద్యమానికి బీజేపీ తరపున మరింత బలమైన మద్దతు అందిస్తామని కొండపల్లి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తక్కెళ్లపల్లి నరేందర్ రావు, తిరుమలాయపాలెం మండల బీజేపీ అధ్యక్షులు బొడ్డుపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొని పాత్రికేయుల పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

# అక్రమ ఆయుధాల ముఠాపై దాడి.. అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** మల్కాజిగిరిలో అక్రమ ఆయుధాల ముఠాపై దాడులు నిర్వహించినట్లు సీపీ సుమతి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఒక అంతర్రాష్ట్ర నేరస్థుడిని పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. "నిందితులు తక్కువ ధరకు బిహార్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు ప్రణాళికను రచించారు. బొల్లారం పోలీసులతో కలిసి ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాం. ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్ జిల్లా దయాల్‌పూర్‌కు చెందిన పర్బన్స్ కుమార్ అదుపులోకి తీసుకున్నాం. అతడు ప్రస్తుతం పటాన్‌చెరులోని బిహార్ బస్తీలో నివాసం ఉంటున్నాడు. నిందితుడి వద్ద నుంచి రెండు 9 ఎంఎం పిస్టల్స్, 17 లైవ్ రౌండ్లు, 3 మ్యాగజైన్లు, డబుల్ బ్యారెల్ తపంచా, 2 లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నాం. డ్రై గంజాయి, గంజాయి చాక్లెట్ల విక్రయ కేసులోనూ గతంలోనూ ఇతడు అరెస్ట్ అయ్యాడు. 2024లో చర్లపల్లి పోలీసులు పర్బన్స్ కుమార్‌పై ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమ ఆయుధాల వ్యాపారంలోకి ప్రవేశించినట్లు దర్యాప్తులో తెలింది. అక్రమంగా తుపాకులు కలిగి ఉండటం తీవ్రమైన నేరం" అని సీపీ సుమతి పేర్కొన్నారు.



# జార్జిరెడ్డి పి డి స్ యూ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** జార్జిరెడ్డి పి డి స్ యూ ఆధ్వర్యంలో ఆగస్టు 24, 25 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జార్జిరెడ్డి పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు నరేష్ రత్న పిలుపునిచ్చారులివిద్యార్థులు, యువత సమాజంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగం, విద్యా రంగంలో ప్రైవేటీకరణ, ఫీజుల భారం, సామాజిక అసమానతలు వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవడానికి రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు...

విద్యార్థి ఉద్యమాల చరిత్ర, ప్రజా ఉద్యమాల పాత్ర, దేశ రాజకీయ పరిస్థితులు, విద్యార్థుల హక్కులు, సామాజిక బాధ్యత తదితర అంశాలపై లోతైన చర్చలు, అధ్యయన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధ్యయనం, ఐక్యత, పోరాటం అనే స్ఫూర్తితో విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే ఈ శిక్షణ తరగతులకు గద్వాల ప్రాంతం నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో...

జార్జి రెడ్డి సభ్యులు రమ్య,శిరీష,స్వప్న,వాసవి, కోమల,సౌజన్య ,తిరుమల,సుకన్య, నవ్య ,క్రాంతి, బేగం,సల్మా,తదితరులు పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
వరతులు వర్తిస్తాయి

## బాలల రక్షణ అధికారులు, విద్యా శాఖ టీచర్స్ లకు ఒకరోజు శిక్షణ

**హైదరాబాద్ పెన్ పవర్:**

,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (లీగల్ సర్వీసెస్) ఆధ్వర్యంలో బాలల రక్షణ అధికారులు, విద్యా శాఖ టీచర్స్ లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి కె.మురళీమోహన్, ఎస్పీ డాక్టర్ శబరిష్, లతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు..ఉదయం నుండి ప్రారంభమైన ఈ సమావేశం సాయంత్రం ఐదు వరకు కొనసాగనుంది, బాలల రక్షణ వివిధ అంశాలపై జిల్లాలోని ( 122 ) ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టీచర్స్, క్లుప్తంగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయి,ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సెల్ అథారిటీ జడ్జ్ శ్రీమతి శాలిని షాకేలి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వాతి మురారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ తేజ్, డిస్టిక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.ద

## ఇంటర్ పూర్తయిన వారికి 25 న జాబ్ మేళా హెచ్ సీ ఎల్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగాల ఎంపిక

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు "హెచ్ సీ ఎల్ టెక్నాలజీ" వారు నిర్వహిస్తున్న "టెక్ బీ ప్రోగ్రాం" కోసం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25వ్త 2026 (మంగళవారం) సమయం: ఉదయం 11:30 గంటలకు హన్మకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఐసీఎస్సెస్ కంప్యూటర్ కేంద్రంలో అర్హత పరీక్ష నిర్వహించబడును. ఈ ఎంపికకు గాను 2025-2026 విద్యా సం. లో వీుజ, జనరల్, ఒకేషనల్ ఏ గ్రూపులో ఇంటర్ పూర్తి చేసినా అర్హులే. ఇంటర్ పరీక్షల్లో 75 % మార్కులుంటే చాలు. టెక్-బీ ప్రోగ్రాంలో ఎంపికయిన వారికి "సాఫ్ట్ వేర్" ఉద్యోగం తో పాటు డిగ్రీ కూడా పూర్తి చేసుకోవచ్చు. జీతం సం. నికి 2.2 నుండి 2.5 లక్షలుంటుంది. అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకురావాల్సిన సర్టిఫికేట్లు

పదవతరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ ఫోటో, ఆండ్రాయిడ్ మొబైల్. మరిన్ని వివరాలకు జిల్లా ఇంఛార్జ్ నరేష్ (7569177071 / 79818 34205 ) ను సంప్రదించవచ్చు.

## అంజయ్య నగర్ లో కూలిన భవనం

**హైదరాబాద్ పెన్ పవర్:** మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్ లో 50గజాల స్థలం లో చేపట్టిన అక్రమ నిర్మాణం శనివారం మధ్యాహ్నం కూలిపోయింది. నాలను అనుకుని అక్రమంగా తక్కువ స్థలంలో ఏడు అంతస్తులతో నిర్మిస్తున్న భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. యజమాని అత్యాశకు పక్కనే ఉన్న నిర్మాణాలు సైతం పాక్షికంగా కూలిపోయాయి. అంజయ్య నగర్ లో 50గజాల స్థలం లో చేపట్టిన అక్రమ నిర్మాణం ఒంటి గంట సమయంలో పూర్తిగా కుప్పగిలింది. భవనంలో మనుషులు ఉన్నారా, లేదా అన్నది ప్రశ్నగా మారింది. నిర్మాణంలో ఉన్న భవనం కూలి పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ లో ఉన్న మరో అపార్ట్మెంట్ పై కూలింది. ఆ భవనం సైతం దెబ్బతిన్నది. మరో పక్కనే ఉన్న హాస్టల్ లోని అందరూ పరుగులు తీశారు..శిథిలాల్లో చిక్కుకున్న ఒకరిని బయటకు తీసారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## అటెన్షన్ డైవర్షన్ కేసులో నిందితులు అరెస్టు

**కూకట్ పల్లి: పెన్ పవర్:** కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధి 9వ ఫేజ్ ఎస్బీఐ ఏటీఎం వద్ద దృష్టి మరల్చి నగదు మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు విద్యాసాగర్ ను పోలీసులు అరెస్టు చేసారు. 2 లక్షల నగదుతో వచ్చిన 56 ఏళ్ల ఉపాధ్యాయురాలికి సహాయం చేస్తానంటూ నిందతుడు మోసం చేసినట్లు నిర్ధారించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసారు. నెక్సస్ మాల్ సమీపంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 70 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడి విద్యా సాగర్ పై గతంలోనే 19 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

## చంపాపేట్లో అమ్మవారి గుడిలో విగ్రహం మాయం

**హైదరాబాద్ పెన్ పవర్:** చంపాపేట్లోని కటికొనుకుంట ప్రాంతంలో అమ్మవారి ఆలయంలో విగ్రహం మాయమైన ఘటన కలకలం రేపుతోంది. ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం కనిపించకపోవడంతో ఆలయ నిర్వాహకులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. విగ్రహం ఎలా మాయమైంది? ఎవరైనా అపహరించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆలయం పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## మొబిలిటీ వ్యాలీని సందర్శించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డా. మెతుకు ఆనంద్

**హైదరాబాద్ పెన్ పవర్:** మొమిన్‌పేట్ మండలం: ఎన్కతల గ్రామ పరిధిలోని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతిపాదిత తెలంగాణ మొబిలిటీ వ్యాలీ ప్రాంతాన్ని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మరియు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ సందర్శించారు.

సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని స్పీకర్ హామీ ఇచ్చినా అమలు కాలేదని, ఆగిపోయిన మొబిలిటీ వ్యాలీ అభివృద్ధి పనులను వెంటనే వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.డా. మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలో ప్రజల తరపున పోరాటం చేస్తున్నామని, ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఆయన ఆరోపించారు.ఎన్కతల గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కంపెనీ వస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయని భూములు ఇచ్చామని, కానీ రెండేళ్లు గడిచినా అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్ గౌడ్, శుభప్రథ్ పటేల్, విజయ్ కుమార్, చిమల్దరి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం కేంద్రం సహకరించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**



పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అక్కన్న పేట లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. తెలంగాణ అభివృద్ధికి అడ్డంకులు ఎందుకు? బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలి. తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించే దమ్ము బీజేపీ నేతలకు లేదా అని ప్రశ్నించారు. తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విఫలం అయ్యారు. రాజకీయాలు కాదు.. తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం కేంద్రం సహకరించాలి. తెలంగాణ రైజింగ్కు కేంద్ర సహకారం అవసరం.. అడ్డంకులు సృష్టించడం సరికాదు రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, దేశ అభివృద్ధి విషయంలో కేంద్రంతో కలిసి పనిచేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడం, వివిధ అంతర్జాతీయ సదస్సుల్లో తెలంగాణ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం, అన్ని వర్గాలను కలుపుకుని సమగ్ర అభివృద్ధి సాధించడం మా లక్ష్యం. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి గారు అమెరికా, లండన్ విదేశీ పర్యటనలు చేపట్టాలనుకున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం అనుమతులు నిరాకరించడం బాధాకరం. రాష్ట్ర ప్రయోజనాల కోసం పెట్టుబడులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి విదేశాలకు వెళ్లే హక్కు కూడా లేదా..? తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధులు, మౌలిక వసతుల విషయంలో కేంద్రం సహకరించాలి. మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్లు, ఇంటర్నల్ రేడియల్ రింగ్ రోడ్లు వంటి కీలక ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ఇతర ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలి. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కూడా కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలి. చిన్నచిన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే విధానం కాకుండా, రాష్ట్రాల అభివృద్ధికి సహకరించే సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించాలని అన్నారు.

తెలంగాణ బీజేపీ నాయకులు ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు..? తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో మీరు ఏ విధంగా వ్యవహరించారో ప్రజలకు తెలుసు.

ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి విషయంలో కూడా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం ఎందుకు గళమెత్తడం లేదు..? బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో ఐక్యత కోసం కేంద్ర నాయకత్వం ప్రయత్నిస్తోందని వార్తలు వస్తున్నాయి. కానీ తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రాన్ని నిలదీయడంలో మాత్రం ఆ ఐక్యత కనిపించడం లేదు. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. మేము రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చించడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ కేంద్రం సహాయ నిరాకరణ చేస్తే తెలంగాణ ప్రయోజనాల కోసం మేము తప్పకుండా ప్రశ్నిస్తాం. తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఎదగాలి. చిన్న రాష్ట్రం అయినప్పటికీ అభివృద్ధిలో ముందుండాలి. ప్రతి వర్గానికి సమగ్ర అభివృద్ధి అందాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం. అదేవిధంగా తెలంగాణ బీజేపీ నాయకత్వాన్ని కూడా కోరుతున్నాం మీరు ఐక్యంగా ఉన్నా, లేకపోయినా మీ ఇష్టం. కానీ తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో ముందుండండి. తెలంగాణ ప్రజల కోసం కేంద్రాన్ని ప్రశ్నించండని అన్నారు.

పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణ కు నిధులు ఎందుకు ఇవ్వడంలేదు.. దక్షిణ భారదేశాల నుండి మేము ఇస్తున్నది ఎంత..? మీరు తిరిగి ఇస్తున్నది ఎంత..? ఒకసారి గమనించుకోవాలి. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేసినప్పుడే తెలంగాణ రైజింగ్ వికసిత్ భారత్ లక్ష్యాలు సాకారం అవుతాయి. తెలంగాణ ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయి? ఇంకా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలి? అనే ఉద్దేశంతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని 183 గ్రామాల్లో "పల్లె పల్లెకు ప్రజాపాలన -- పల్లె పల్లెకు పొన్నం" కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ నెల 19 వ తేదీ నుంచి ప్రతి రోజు ఒక మండలంలో 5 నుంచి 6 గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో నేరుగా సమావేశమవుతున్నాం. ఇది నాలుగో మండలంలో కొనసాగుతున్న కార్యక్రమం. ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను ఓపికగా వింటున్నామని అన్నారు.

ముఖ్యంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలు, ఆయిల్పామ్ సాగు, ఇతర ప్రత్యామ్నాయ పంటలు, రైతులకు అవసరమైన సూచనలు, ఆరోగ్యం, విద్య, అంగన్వాడీ కేంద్రాలు, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, కొత్త పెన్షన్లు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల సమస్యలను కేవలం వినడంతో ఆపకుండా, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. మండలస్థాయి అధికారులను కూడా ఈ సమావేశాల్లో భాగస్వాములను చేయడం వల్ల విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి చిన్నచిన్న సమస్యలు కూడా వెంటనే పరిష్కారమవుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దూరం తగ్గించడమే ప్రజాపాలన లక్ష్యం. ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందించినా, నేరుగా చెప్పినా వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించే బాధ్యత తీసుకుంటున్నాను. భవిష్యత్తులో జరిగే ప్రతి కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాను. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుంది. పల్లెకు ప్రభుత్వం రావాలి.. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలి. ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి అందాలి. ఇదే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

## ఆక్స్ ఫోర్డ్ యూనివర్సిటీ విద్యావేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి భేటి

**హైదరాబాద్ పెన్ పవర్:**

తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లండన్లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో శుక్రవారం 900 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించింది.

తెలంగాణతో ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లోవాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బెలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.



ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' విజన్ను వారికి సమగ్రంగా వివరించారు. హైదరాబాద్ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

హైదరాబాద్లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు.

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు.

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి చారిత్రక సోమర్విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చిత్రపటాన్ని తిలకించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే.

అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంథి గారితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు.

ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్స్తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

**మహబూబాబాద్: పెన్ పవర్:** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గూడూరు మండల కేంద్రంలో మన ఊరు – మన బాధ్యత '2ఖ రన్ -- ఫర్ డ్రగ్స్ ఫ్రీ సొసైటీ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,000 మందికి పైగా విద్యార్థులు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ జెండా ఊపి 2ఖ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతను ఉద్దేశించి ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, యువత దురలవాట్లకు దూరంగా ఉంటూ తమ జీవిత లక్ష్యాలను సాధించేందుకు కష్టపడాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. క్షణిక ఆనందం కోసం మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాంతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందని ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా గంజాయి టెస్టింగ్ కిట్ పనితీరును విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వినియోగంపై అనుమానం ఉన్న సందర్భాల్లో పరీక్షల ద్వారా గుర్తించే విధానం గురించి అవగాహన కల్పించారు. యువత ఇటువంటి పరిస్థితులకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు.

డ్రగ్స్‌ను విక్రయించడం, సరఫరా చేయడం, రవాణా చేయడం లేదా వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే చీణూూ చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలాంటి కేసుల్లో చిక్కుకోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, విదేశీ ప్రయాణాలకు సంబంధించిన అవకాశాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. మైనర్లకు సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా తదితర పొగాకు ఉత్పత్తులను విక్రయించే దుకాణదారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కిరాణా, పాన్ షాపుల వద్ద మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదనే హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు, యువత పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారికి రూ.5,000 వరకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం కోసం యాంటీ–డ్రగ్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 56999కు సంప్రదించాలని కోరారు.

కార్యక్రమం ముగింపులో ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పడమటి గూడెంలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్ పెన్ పవర్:** పడమటి గూడెం గ్రామ పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య యాదవ్ ఆధ్వర్యంలో అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చూడటమే ప్రజా పాలన లక్ష్యమని పేర్కొన్నారు.

పేదల ఇంటికి సంక్షేమం...

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ భరోసా...స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత ప్రయోజనం! ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. పడమటి గూడెం గ్రామ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోంది.

# మనమందరం కలిసి మంచి సమాజ నిర్మాణం కోసం పాటుపడదాం"

**హైదరాబాద్ పెన్ పవర్:** బయ్యారం మండలం సంతులాల్‌పాడు గ్రామపంచాయతీలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 'మన ఊరు -- మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పరిధిలోని సుమారు 800 మంది ప్రజలు పాల్గొన్నారు. ముందుగా గ్రామస్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, సీసీ కెమెరాల అవసరం, వాటి ప్రయోజనాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్తపేట సర్పంచ్ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆలోచనలకు అనుగుణంగా మొదటి విడతలో కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో 26 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అనంతరం దొంగతనాలు గణనీయంగా తగ్గాయని, బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వంటి మాదకద్రవ్యాలను వినియోగించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు సీసీ కెమెరాలను చూసి భయపడుతున్నారని తెలిపారు. ప్రజలు, పోలీసుల సమన్వయంతో గ్రామంలో మరింత భద్రతను పెంపొందించుకోవచ్చని అన్నారు. సంతులాల్‌పాడు గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని సురక్షితంగా ఉంచేందుకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామాన్ని మాదకద్రవ్యాల నుంచి కాపాడటంతో పాటు యువతను గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు ప్రజలందరం కలిసి బాధ్యతగా వ్యవహరిస్తామని అన్నారు. అనంతరం గ్రామస్థులు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం, గంజాయి నుంచి గ్రామాన్ని మరియు యువతను రక్షించడం వంటి అంశాలపై సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. సీఐ రవీందర్ మాట్లాడుతూ గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, వాటి విక్రయం, వినియోగంపై చట్టపరంగా విధించే శిక్షలు, జరిమానాల గురించి గ్రామస్థులకు వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి, వాటి నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆలోచనల నుంచి రూపుదిద్దుకున్న 'మన ఊరు -- మన బాధ్యత' కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందన్నారు. కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గడం, గంజాయి వినియోగం తగ్గడం, హెల్మెట్ వినియోగం పెరగడం వంటి సానుకూల మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. పోలీసులతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా భాగస్వాములైనప్పుడే ఈ కార్యక్రమం మరింత విజయవంతమవుతుందని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ మాట్లాడుతూ, "మనం చేసే పనులను చూసే మన పిల్లలు నేర్చుకుంటారు. మన ఆలోచనలు, మన నిర్ణయాలను బట్టే మన జీవనశైలి ఉంటుంది. మన జీవనశైలినే మన పిల్లలు అనుసరిస్తారు. ఈరోజు మనం తీసుకునే నిర్ణయమే రేపు మన జీవితాన్ని, మన పిల్లల భవిష్యత్తును మార్చగలదు" అని అన్నారు.

# సీపీఆర్ శిక్షణతో ప్రాణాలు కాపాడాలి

**అత్యవసర సమయాల్లో సీపీఆర్ ఎంతో కీలకం**


**ప్రతి పోలీసు సిబ్బంది సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి**

**మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**

**హైదరాబాద్ పెన్ పవర్:** అత్యవసర పరిస్థితుల్లో అందించే సీపీఆర్ శిక్షణను సద్వినియోగం చేసుకుని విలువైన ప్రాణాలను కాపాడాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీసులు నిత్యం ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తారని, ప్రమాదాలు, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సంఘటనా స్థలానికి ముందుగా చేరుకునే అవకాశం పోలీసులకే ఎక్కువగా ఉంటుందని తెలిపారు. యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించారు. అత్యవసర సమయంలో సీపీఆర్‌ను ఎప్పుడు, ఎలా చేయాలనే అంశాలను వైద్య నిపుణులు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. సీపీఆర్ చేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గుండెపోటు లేదా ఇతర కారణాలతో వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడినప్పుడు ఆస్పత్రికి తరలించేలోపు సీపీఆర్ అందించడం ఎంతో కీలకమన్నారు. సకాలంలో సరైన విధంగా సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్ ఎప్పుడు, ఎక్కడ అవసరం వస్తుందో చెప్పలేమని.. అందుకే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తప్పనిసరిగా సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించి బాధితుడికి అవసరమైన ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలు చేపట్టేలా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. పోలీసులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజలకు కూడా సీపీఆర్ ప్రాముఖ్యతను తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఒక వ్యక్తి ప్రాణాపాయంలో ఉన్నప్పుడు సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడగలిగితే అంతకంటే గొప్ప సేవ మరొకటి ఉండదన్నారు. ఈ శిక్షణను కేవలం కార్యక్రమానికే పరిమితం చేయకుండా, అవసరమైన సమయంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, యూత్ ఫర్ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు

# బాద్యతలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే తలసాని

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తన బాధ్యతలను విస్మరిస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. సనత్ నగర్ లోని రాజరాజేశ్వరి నగర్ లో తన సొంత నిధులు 2.50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన జజ కెమెరాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జజ కెమెరాల ఏర్పాటు తో కాలనీలో శాంతిభద్రతల పర్యవేక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రాత్రివేళల్లో కాలనీలో పర్యటించే అపరిచిత వ్యక్తులు, ఆకతాయిలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. 2014 కు ముందు రాజరాజేశ్వరి కాలనీలో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా ఉండేవికావని గుర్తు చేశారు. తాను వచ్చిన తర్వాత కోట్లాది రూపాయల వ్యయంతో దశల వారిగా అనేక అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని వివరించారు. ఒక్క రాజరాజేశ్వరి నగర్ కాలనీలో మాత్రమే కాదని సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని వివరించారు. త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం సనత్ నగర్ లో రిజర్వాయర్ నిర్మాణం, అనేక రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలన వచ్చాక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ



హయాంలో లేని త్రాగునీరు, విద్యుత్ సమస్యలు ఇప్పుడు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. నల్లాలకు ఇవ్వడానికి లేని నీరు ట్యాంకర్ ల ద్వారా అమ్ముకోవడానికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించామని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా నిధులు లేవని సమాధానం చెబుతుందని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ప్రజా పాలన అని ఎలా ప్రకటించుకుంటున్నారని అన్నారు. ఫతే నగర్ ఫ్లై ఓవర్ విస్తరణ, సనత్ నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో అండర్ పాస్ నిర్మాణానికి తమ ప్రభుత్వ హయాంలో 100 కోట్ల రూపాయలతో నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతు ల మీదుగా శంకుస్థాపన చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పనులను రద్దు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రి గా ముందు చూపుతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. కరోనా సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మించాలని నిర్ణయించగా, సనత్ నగర్ లో ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్ ప్రాంతం ఎంతో అనువుగా ఉంటుందని తాను ప్రతిపాదించానని చెప్పారు. 2022 లో కేసీఆర్ చేతుల మీదుగా సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో టిమ్స్ హాస్పిటల్ ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నాటికి 80 శాతం నిర్మాణ పనులు జరిగాయని గుర్తు చేశారు. కానీ ముఖ్యమంత్రి అర్ధం పర్ధం లేకుండా టిమ్స్ హాస్పిటల్ ను తామే నిర్మించామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి మాట్లాడుతున్న బూతు భాషను ప్రజలు అసహించుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## స్కూల్ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం విద్యార్థులు సురక్షితం

**మహబూబాబాద్ పెన్ పవర్:** తొర్రూరులో సెయింట్ పాల్స్ స్కూల్ బస్సు వేగంగా వచ్చి లారీని ఢీకొట్టింది. బస్సులో ఉన్న 50 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. పెద్ద ప్రమాదం తప్పడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మార్నింగ్ వాక్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి

**నిజామాబాద్: పెన్ పవర్:** నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించారు. నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో స్థానిక శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న మరియు ఇప్పటికే పూర్తయిన, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, లబ్దిదారుల మనోగతాన్ని తెలుసుకున్నారు.

మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడినప్పుడు, సొంతింటి కల నెరవేరిందనే ఆనందం వారి కళ్లలో కనిపించింది. ఈ ప్రభుత్వానికి ఆశీర్వాదాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ వారు చెప్పిన మాటలు నాకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించాయని అన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాల జీవితాల్లో తీసుకొస్తున్న మార్పును ప్రత్యక్షంగా చూడటం ఒక గొప్ప అనుభూతి. వారి ముఖాల్లో కనిపించిన ఆనందమే ప్రజా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరుతున్నయి అనేందుకు నిదర్శనం. ఇతకంటే ఒక మనిషికి కావాల్సింది ఏముంటది..? ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో మాట్లాడినప్పుడల్లా పేదింటి చిరకాల కలను తీర్చే బాధ్యత దొరకడం అనేది నా అదృష్టంగా బావిస్తుంటా.. ఈ సందర్భంగా లబ్దిదారులకు కానుకలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. తరువాత హైదరాబాద్ తరహాలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ను రాష్ట్రంలోని ఇతర పట్టణాలలో కూడ నిర్మించేలా నిజామాబాద్ నుండి శ్రీకారం చుట్టబోతున్నాం. దీనికి కోసం నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న హౌసింగ్ శాఖ కు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లను రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలందరికి ఇవ్వాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు విడతలు, హైదరాబాద్లో ఇచ్చే మొదటి విడత ఇండ్లతో కలిసి 8 లక్షల ఇండ్లు మంజూరు చేశాం, 2 లక్షల ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడ పూర్తయ్యాయని అన్నారు. అక్కడనుండి నిజామాబాద్ పట్టణంలో గత ప్రభుత్వాలు నిర్మించదలచి, అరకొరగా నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాన్ని పరిశీలించి, నివాసయోగ్యానికి కావాల్సిన నిర్మాణాలు, వసతులను వెంటనే పూర్తిచేసి, అర్హులైన లబ్దిదారులకు ఎంపిక చేసి ఇండ్లను మంజూరు చేసి, అందించాలని జిల్లా కలెక్టరు, అధికారులను ఆదేశించారు.

## వ్యాధి బారిన పడకముందే జాగ్రత్తలు తీసుకోవాలి- ఆచార్య మనీష్ ఆయుర్వేద వైద్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని ఆయుర్వేద నిపుణులు ఆచార్య మనీష్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు తాను,తన వైద్య బృందంతో కలిసి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో కిడ్నీ,లివర్,గుండె సంబంధిత వ్యాధులు,క్యాన్సర్, మధుమేహం,రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్' కంటే 'ప్రివెన్షన్ ఈజ్ ది ఓన్లీ క్యూర్' అనే నినాదంతో తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు.

దేశవ్యాప్తంగా తమకు 120కి పైగా ఆయుర్వేద క్లినిక్లు, ఆసుపత్రులు,వెల్నెస్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్తో పాటు బెంగళూరు,చెన్నై,పాట్నా, కోల్కతా,ఢిల్లీ,ముంబై, చండీగఢ్,లూధియానా, డెహ్రాడూన్ తదితర నగరాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తీవ్రమైన వ్యాధులకు సంబంధించి వ్యక్తిగత అనుభవాలను సాధారణ వైద్యపరమైన నిర్ధారణగా పరిగణించరాదని అర్హత కలిగిన వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. వేల సంవత్సరాల క్రితమే ఆయుర్వేదంలో ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన విధానాలను సూచించారని, పంచకర్మ వంటి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయుర్వేద వైద్యాన్ని ఆరోగ్య పథకాల్లో మరింత విస్తృతంగా చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, సాధారణ ప్రజలకు ఆయుర్వేద చికిత్స అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య సలహాల కోసం హైదరాబాద్లో తమ ఆయుర్వేద కేంద్రం రాజ్భవన్ రోడ్,సోమాజిగూడలో ఉందని తెలిపారు.

## భోజనానికి పిలిచి దారుణ హత్య.. పూజా గదిలో తల దాచిన కిరాతకుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒడిశాలోని బొలాంగిర్ జిల్లాలో ఆగస్టు 18న సంతోష్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ప్రధాన నిందితుడు శత్రుఘ్న సాహూ, సహచరులు కలిసి అతన్ని భోజనానికి పిలిచి, నిద్రపోయాక హత్య చేశారు. అనంతరం తలను మొండెం నుంచి వేరు చేసి, గ్రామం వెలుపలి చెరువులో మృతదేహాన్ని పడేశారు. తెగిపోయిన తలను సాహూ ఇంట్లోని పూజా గదిలో దాచినట్లు పోలీసులు గుర్తించారు. భార్యను తిరిగి తెచ్చుకోవాలనే మూఢనమ్మకంతో నరబలికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో సాహూతో పాటు మరో నలుగురిని అరెస్ట్ చేశారు.

## హెచ్ఐవి తో బాధపడుతున్న మహిళను అడవిలో వదిలేసిన కుటుంబం

**జయశంకర్ భూపాలపల్లి: పెన్ పవర్:** జిల్లాలో మానవత్వాన్ని మరిచిపోయిన ఘటన చోటుచేసుకుంది. హెచ్ఐవి తో బాధపడుతున్న ఒక మహిళను ఆమె కుటుంబసభ్యులు అడవిలో వదిలి వెళ్లిపోయారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. అనంతరం, ఆ మహిళను మహాదేవపూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించినప్పటికీ నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్ హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్తున్నామని చెప్పి కుటుంబసభ్యులు ఆ మహిళను అడవిలో వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది.

## భోజనానికి పిలిచి దారుణ హత్య.. పూజా గదిలో తల దాచిన కిరాతకుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒడిశాలోని బొలాంగిర్ జిల్లాలో ఆగస్టు 18న సంతోష్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ప్రధాన నిందితుడు శత్రుఘ్న సాహూ, సహచరులు కలిసి అతన్ని భోజనానికి పిలిచి, నిద్రపోయాక హత్య చేశారు. అనంతరం తలను మొండెం నుంచి వేరు చేసి, గ్రామం వెలుపలి చెరువులో మృతదేహాన్ని పడేశారు. తెగిపోయిన తలను సాహూ ఇంట్లోని పూజా గదిలో దాచినట్లు పోలీసులు గుర్తించారు. భార్యను తిరిగి తెచ్చుకోవాలనే మూఢనమ్మకంతో నరబలికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో సాహూతో పాటు మరో నలుగురిని అరెస్ట్ చేశారు.

## హెచ్ఐవి తో బాధపడుతున్న మహిళను అడవిలో వదిలేసిన కుటుంబం

**జయశంకర్ భూపాలపల్లి పెన్ పవర్:**
జిల్లాలో మానవత్వాన్ని మరిచిపోయిన ఘటన చోటుచేసుకుంది. హెచ్ఐవి తో బాధపడుతున్న ఒక మహిళను ఆమె కుటుంబసభ్యులు అడవిలో వదిలి వెళ్లిపోయారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. అనంతరం, ఆ మహిళను మహాదేవపూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించినప్పటికీ నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్ హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్తున్నామని చెప్పి కుటుంబసభ్యులు ఆ మహిళను అడవిలో వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది.

## ఫార్మా కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం

**యాదాద్రి పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతీ గూడెం గ్రామంలో హెజిలో ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు భారీగా ఎగిసి పడ్డాయి. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసారు. ఘటనలో గాయాపడ్డ ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. మరో పది మందికి గాయాలు అయ్యాయి. పోలీసులు క్షగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రియాక్టర్ పేలడం తో ప్రమాదానికి కారణంగా అనుమానిస్తున్నారు. ఒక్కసారిగా రియాక్టర్ పేలడం తో భారీ శబ్దానికి దోతీ గూడెం, అంతమ్మా గూడెం గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. మూడు నెలల పరిధి లో రెండవ సారి ప్రమాదం ఈ కంపెనీ లో చోటు చేసుకుంది. ...

## 14 కొండాకు పదవీ గండం...

**వరంగల్, ఆగస్టు 22 పెన్ పవర్:** కొండా సురేఖ మంత్రి పదవి తొలగింపుపై రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరేకంగా అందరూ ఒక్కటయ్యారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖ కుటుంబ వ్యవహార శైలిపై పార్టీ హైకమాండ్ కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. అయితే కొండా సురేఖ మీద చర్యలు తీసుకుంటే కట్టుబాటు తప్పిన మిగిలిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే బీసీ కార్డుతో కొండా సురేఖ పార్టీని ఇరకాటంలోకి పెట్టే అవకాశముంది. అందుకే కొండా సురేఖ వ్యవహారాన్ని పరిశీలిస్తున్న నాయకత్వం ఏదో ఒక చర్య మాత్రం తీసుకోవాలని చూస్తుంది.. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కొండా సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు ఆ వ్యాఖ్యలు తన కుమార్తె వ్యక్తిగతమని, తనకూ వాటికి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేస్తూ క్రమశిక్షణా సంఘానికి లేఖ రాశారు.మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేదా అనే అంశంపై పార్టీ హైకమాండ్ మరియు సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది. దళిత ఎమ్మెల్యేను అవమానపర్చిన సమయంలోనూ, ఇతర సామాజికవర్గం నేతలను కించపర్చినప్పుడు ఒక్కటవ్వని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ విషయంలో ఒక్కటవ్వడంపై కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది కానీ కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలంటే అందుకు కొంత పార్టీ సాహసం చేయాల్సి ఉంటుంది. మిగిలిన క్రమశిక్షణ తప్పిన రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే అవి తప్పుడు సంకేతాలు వెళతాయి. తెలంగాణలో బలమైన బీసీ సామాజికవర్గంలో వ్యతిరేకత వస్తే అది రాజకీయంగా ఇబ్బందిగా మారుతుంది. అందుకే కొండా సురేఖ పై చర్యలు అంత సులువు కాదు. కాకుంటే ఇకపై ఎలాంటి దూకుడు గా వ్యవహరించకుండా కొంత కళ్లెం వేయవచ్చన్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. కొండా సురేఖకు వ్యతిరేకంగా పదహారు మంది ఎమ్మెల్యేలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొందరు లోపాయికారీగా కొండాసురేఖకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. మరి కొండా వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందన్నది చూడాలి.

## రాయదుర్గంలోని భూములు రికార్డు ధర

**హైదరాబాద్, ఆగస్టు 22 పెన్ పవర్:**
రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూములు రికార్డు ధర పలికాయి. తాజాగా నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరా భూమి రూ.264 కోట్ల భారీ ధర పలికింది. మీచీ రియాలిటీ సంస్థ అంత ధర పలికి భూములు దక్కించుకుంది. అధిక ధర పలికి మొత్తం 5.25 ఎకరాలను అదే సంస్థ వేలంలో సొంతం చేసుకుంది. దాదాపు 3 నెలల కిందట జరిగిన వేలంలో ఇదే సర్వే నెంబర్‌లో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికిన విషయం తెలిసిందే. తాజాగా ఈ రికార్డు బద్ధలుకొట్టి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కుతోంది. భూముల వేలానికి సుప్రీంకోర్టు లైన్ క్లియర్ చేయడంతో సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాలను ఆన్‌లైన్లో వేలం వేశారు.రంగారెడ్డి జిల్లాలోని రాయదుర్గం పాన్‌మక్తాలో 11 ఎకరాల టీజీఐఐసీ భూముల వేలం ప్రక్రియను నిలిపివేసుందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శుక్రవారం నాడు నిరాకరించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఇందులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు, వేలం వేసే ప్రాంతానికి 5 కి.మీ దూరం ఉందని, రెండింటికీ సంబంధం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ స్పష్టం చేయడంతో జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం తిరస్కరించింది. ఇంకా ఈ విషయంపై ఏమైనా వివాదాలుంటే తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు సూచించింది.ఇప్పటికే ఈ వేలంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జీలు కూడా ఇదివరకే నిరాకరించారు. ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ (ఎల్ఆర్టీ)ను ఆశ్రయించినట్లు లేదా విచారణ పెండింగ్‌లో ఉన్నట్లు ఆధారాలు లేవని జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ పేర్కొనగా, ఎస్. రవీంద్రనాథ్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై జస్టిస్ నగేష్ భీమపాక ప్రభుత్వం, హెచ్ఎండీఏలను కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 19కి వాయిదా వేయడం తెలిసిందే. దీంతో ఎకరాకు రూ.175 కోట్ల కనీస ధరతో టీజీఐఐసీ చేపట్టిన ఆన్‌లైన్ వేలానికి మార్గం సుగమమైంది. అయితే టీజీఐఐసీ ఆన్‌లైన్లో భూమల వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో ఎకరా 264 కోట్లు పలికింది. దాదాపు మూడు నెలల కిందట నిర్వహించిన వేలంలో ఇక్కడి భూమి ఎకరా రూ. 237 కోట్లు పలికిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ లో పతాక స్థాయికి చేరిన కుమ్ములాటలు



**హైదరాబాద్, ఆగస్టు 22 పెన్ పవర్:** తెలంగాణలో మరోసారి అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్న వేళ, సొంత పార్టీలోనే అసమ్మతి సెగలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి సహజ సిద్ధమైన “అంతర్గత ప్రజాస్వామ్యం” అనే ముసుగులో నేతలు హద్దులు దాటి బహిరంగ విమర్శలకు దిగడం ఇప్పుడు గాంధీభవన్‌ను కుదిపేస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి వంటి సీనియర్ల అసంతృప్తి ఒక ఎత్తయితే, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా ముఖ్యమంత్రినే లక్ష్యంగా చేసుకుని చేసిన తీవ్ర వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.వరంగల్ జిల్లా గీసుకొండ వేదికగా కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని అసలైన ఘర్షణ స్వభావాన్ని బయటపెట్టాయి. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదని, పార్టీ క్రమంగా ‘టీడీపీ కాంగ్రెస్’గా మారుతోందంటూ ఆమె నేరుగా సిద్ధాంతపరమైన దాడికి దిగారు. పరకాల టికెట్ వ్యవహారంలో సీఎం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ, “మాకు టికెట్ నిరాకరించడానికి రేవంత్ రెడ్డి ఎవరు?” అని ప్రశ్నించడం అధిష్టాన స్థాయికి చేరిన అంతర్గత పోరును సూచిస్తోంది. కొడంగల్‌లో గతంలో ఆయన ఓడిపోయిన సందర్భాన్ని, రేవంత్‌ను పీసీసీ అధ్యక్షుడిగా సమర్థించిన గతాన్ని ప్రస్తావిస్తూ స్వతంత్రంగానైనా బరిలోకి దిగుతానని హెచ్చరించడం తీవ్ర స్థాయి ధిక్కారానికి నిదర్శనం.ఈ తిరుగుబాటు కేవలం ఒక్క నియోజకవర్గ టికెట్ పోరు మాత్రమే కాదు. కాంగ్రెస్‌లో ఎప్పటినుంచో రగులుతున్న ‘వలస నేతలు వర్సెస్ ఒరిజినల్ కాంగ్రెస్’ వివాదానికి ఇది పరాకాష్ట. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం దక్కుతోందని, ఉద్యమ కాలం నుంచి పార్టీని మోసిన పాత తరం నేతలు, ముఖ్యంగా బీసీ నాయకత్వం క్రమంగా పక్కకు నెట్టివేయబడుతోందనే అసహనం ఈ వరుస ప్రకటనల్లో స్పష్టంగా వ్యక్తమవుతోంది.మరోవైపు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, క్రమశిక్షణా కమిటీ ఈ పరిణామాలను అదుపు చేయడంలో పూర్తిగా నిస్సహాయంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం, పార్టీ విధానాలపై బహిరంగంగా విరుచుకుపడుతున్న కీలక నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం నాయకత్వ లోపాన్ని, సమన్వయ లేమిని ఎత్తిచూపుతోంది. ఎంపీ మల్లు రవి వంటి సీనియర్లు క్రమశిక్షణపై పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, పాలనాపరమైన సంస్కరణలపై దృష్టి సారిస్తున్న సమయంలో, సొంత క్యాబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అంతర్గత కుమ్ములాటల రూపంలో సాగుతున్న ఈ పరిణామాలు ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు బలమైన రాజకీయ ఆయుధంగా మారుతున్నాయి.పాలనపై ప్రతిపక్షాల విమర్శల కంటే సొంత పార్టీ నేతల అసమ్మతి బాణాలే ప్రభుత్వానికి పెద్ద ముప్పుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఏఐసీసీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని సమన్వయ కమిటీ ద్వారా అసమ్మతి నేతలతో చర్చలు జరపకపోతే లేదా కఠినమైన క్రమశిక్షణా చర్యలు చేపట్టకపోతే, ఈ అంతర్గత విభేదాలు మరింత విస్తరించి ప్రభుత్వ స్థిరత్వానికే పెద్ద సవాలుగా మారే అవకాశముంది.

## ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లులకు రూ.300 కోట్లు విడుదల

**మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్ పెన్ పవర్:**
పేదలకు ఇళ్ల పథకంలో కేంద్రం నుంచి రాఇవ్వాల్సిన రూ.72 వేల నిధుల్లో జాప్యం జరుగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.. జగిత్యాలలో ఉమ్మడి కరీంనగర్ 4 జిల్లాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల ా- 3 సమస్యలను నెలాఖరులోగా, లబ్ధిదారుల ఎంపికను సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తుది బిల్లులు 15 రోజుల్లో చెల్లిస్తామని తెలిపారు. భూ రీ-సర్వేతో 99% రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అవినీతిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.కేంద్రం ఆలస్యం చేసినా లబ్ధిదారులను ఇబ్బంది పెట్టబోమన్నారు. 2026 మార్చి 31 వరకు పూర్తైన ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లులకు రూ.300 కోట్లు సోమవారం విడుదల చేస్తామని తెలిపారు. మిగతా బిల్లులనూ చెల్లిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని అన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మరో ఎంపీకి అమాత్య యోగం

**హైదరాబాద్ ఆగస్టు 22 పెన్ పవర్:**
కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం వస్తుందన్న సమాచారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల చేపట్టిన బీజేపీ కేంద్ర కమిటీ విస్తరణలో తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం, అదే సమయంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖ నేతలను జాతీయ కార్యకర్గం నుంచి తప్పించడంతో ఈ ప్రచారానికి ఊతమిస్తుందని చెబుతున్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. పునర్వ్యస్థీకరణలో మరొకరికి చాన్స్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు.మరో రెండేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హాట్ ఫేవరెట్ గా పోటీ ఇవ్వాలంటే రాష్ట్రంలో బీజేపీ నేతలు మరింత క్రియాశీలంగా పనిచేయాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతిపక్షాన్ని వెనక్కి నెట్టి ఆ స్థానంలో పోటీ ఇవ్వడమే కాకుండా, అధికారంలోకి రావాలంటే పార్టీని ఇంకా విస్తరించాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. తమ లక్ష్యానికి చేరువ కావాలంటే పార్టీని పరిగెత్తించాలని, ఇందుకోసం నేతలకు కొత్త పదవులతో ప్రోత్సహించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో తెలంగాణ నుంచి కచ్చితంగా ఒకరికి అవకాశం వస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఇంకా మిగిలిన ఆరుగురిలో ఒకరికి చాన్స్ ఇస్తారా? లేక బయట రాష్ట్రాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికే చెందిన ఎంపీలకు అవకాశం ఇస్తారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన ఇద్దరు బీజేపీ నేతలు బయట రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరిలో సంఘ్ నేపథ్యం ఉన్న ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య ఉన్నారు. లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చెందిన 8 మందిలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందనేది విస్తృత చర్చగా ఉందని చెబుతున్నారు. ప్రధానంగా అనేక సమీకరణాలను పరిశీలిస్తున్న బీజేపీ అధిష్టానం బీసీ, మహిళ కోటాలో ఒకరికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే బీసీ కోటాలో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ మంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి చెందిన మహిళా నాయకురాలు డీకే అరుణ మంత్రి పదవి రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీకే అరుణను మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే ఆలోచనతోనే ఆమెను బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని చెబుతున్నారు. కేంద్రం చెప్పిన కారణమేంటి? ప్రస్తుత సమీకరణాలను పరిశీలిస్తే కేంద్ర మంత్రివర్గంలో డీకే అరుణకు చోటిచ్చే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు. డీకే అరుణ సీనియార్టీ, సామాజిక నేపథ్యంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఆమెకు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతానికి చెందిన అరుణ అన్నిరకాలుగా సీఎం స్పీడుకు బ్రేకులు వేయగలరని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దన్నుగా ఉంటున్న అగ్రవర్ణాలలోనూ చీలక తేవడానికి అరుణ నాయకత్వం ఉపయోగపడుతుందనే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. అయితే ఆమెకు దీటుగా బీసీ నేత లక్ష్మణ్ పేరు కూడా ఎక్కువగా వినిపిస్తోందని అంటున్నారు. తొలి నుంచి బీజేపీలో కొనసాగుతున్న లక్ష్మణ్ కు సంఘ్ నేపథ్యం అదనపు బలంగా చెబుతున్నారు. దీంతో రాష్ట్రం నుంచి డీకే అరుణ, లక్ష్మణ్ మధ్య మంత్రి పదవికి గట్టి పోటీ జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# సగం హైదరాబాద్ లో సెటిలర్స్ ప్రభావమే...

## 28 నియోజకవర్గాల్లో 15 చోట్ల డామినేషన్

**హైదరాబాద్, ఆగస్టు 22 పెన్ పవర్:**
ఆంధ్రా సెటిలర్స్ ఈసారి హైదరాబాద్‌లో ఓట్లేయడం లేదా.. అన్న విషయం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ తర్వాత భారీగా ఓట్లు కేటగిరీలోకి వెళ్లడం, మరికొన్ని లక్షల ఓట్లు ఉండటం హైదరాబాద్ రాజకీయాలపై కొత్త చర్చకు తెరతీసింది. సెటిలర్స్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల తగ్గదల ఆసక్తికరంగా మారింది. తెలంగాణ ఎన్నికలు అనగానే ప్రత్యేకంగా చర్చకు వచ్చే అంశాల్లో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఒకటి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆంధ్రా ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక వర్గంగా చాలాకాలంగా చర్చలో ఉంటున్నారు. కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 15 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం గణనీయంగా ఉందనే అంచనాలు ఉన్నాయి.ప్రతి ఎన్నికల సమయంలో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఏ వైపు మొగ్గుతాయి? ఏ పార్టీకి లాభం చేకూరుతుంది? అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. అయితే ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది.తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ---లో భారీ సంఖ్యలో ఓట్లు జాబితా నుంచి తొలగించడం మరికొన్ని ఓట్లను పెండింగ్‌లో ఉంచడం ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోంది. తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లను తొలగించారు. వీళ్లను లో పెట్టారు. అంటే గైర్హాజరు, వేరే ప్రాంతానికి మారిన వారు, తొలగించబడిన లేదా డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి ఓట్లు ఈ కేటగిరీలోకి వెళ్లాయి. అంటే.. మళ్లీ అప్లై చేసుకుంటే తప్ప ఈ ఓట్లు లేనట్లే. జూన్ నాటికి తెలంగాణలో మొత్తం 3 కోట్ల 38 లక్షల 26 వేల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73 లక్షల ఓట్లు పోయాయంటే.. మొత్తం ఓటర్లలో దాదాపు 22 శాతం ఓట్లు జాబితా నుంచి బయటకు వెళ్లినట్టవుతుంది. తర్వాత తెలంగాణ ఓటర్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు మిగిలాయి. అయితే ఈ ఓట్లన్నీ పూర్తిగా ధృవీకరించినవని చెప్పలేమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. మరో 92,87,577 ఓట్లను విత్ హెల్డ్ కేటగిరీలో ఉంచారు. ఈ ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో తేడాలు, సమర్పించిన పత్రాలు 2002 రికార్డులతో సరిపోకపోవడం వంటి కారణాలతో వాలిడేషన్ పూర్తికాలేదని చెబుతున్నారు.అంటే తెలంగాణలో తొలగించబడిన 73 లక్షల ఓట్లతో పాటు మరో దాదాపు 93 లక్షల ఓట్లు కూడా ప్రస్తుతం తుది స్థితిలో లేవు.తొలగించిన, పెండింగ్‌లో ఉంచిన ఓట్లను కలిపితే ఈ సంఖ్య దాదాపు 1.66 కోట్లు.అంటే తెలంగాణ మొత్తం ఓటర్లలో దాదాపు సగం ఓట్లు ఏదో ఒక రకంగా ప్రభావానికి లోనైనట్టుగా కనిపిస్తోంది.ఇక్కడే అసలు కీలకమైన విషయం బయటకు వస్తోంది. తెలంగాణలో కేటగిరీలోకి వెళ్లిన 73 లక్షల ఓట్లలో 43 లక్షల ఓట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలోనే ఉన్నాయని లెక్కలు సూచిస్తున్నాయి. అంటే తెలంగాణలోని 33 జిల్లాల్లో తొలగించబడిన ఓట్లలో దాదాపు 60 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయి. ఇదే సమయంలో ఈ మూడు జిల్లాల్లో మరో 39 లక్షల ఓట్లు అభ్యంతరాలు, మ్యాపింగ్ లేదా ఇతర ధృవీకరణ సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అంటే తొలగించబడిన లేదా ఇంకా పూర్తిగా ఆమోదించబడని ఓట్లలో దాదాపు 83 లక్షలు కేవలం ఈ మూడు జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.ఇక్కడి నుంచే కేవలం ఓటర్ల లెక్కలకు సంబంధించిన అంశమేనా? లేక హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపుతుందా? అనే ప్రశ్న మొదలవుతోంది.

హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఇందులో 43 లక్షల ఓట్లు కేటగిరీలోకి వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే మెట్రోపాలిటన్ ప్రాంతంలోని దాదాపు 37 శాతం ఓట్లు ప్రభావితమయ్యాయి. తెలంగాణలో నమోదైన ప్రతి 100 ఓట్లలో దాదాపు 59 ఓట్లు హైదరాబాద్ మెట్రో ప్రాంతం నుంచే ఉన్నట్లు కనిపిస్తోంది.అయితే ఈ 43 లక్షల ఓట్లన్నీ ఆంధ్రా సెటిలర్స్‌వే అని చెప్పడానికి ఆధారం లేదుహైదరాబాద్ ఒక మెట్రో నగరం కావడంతో తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి, అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు.అయితే ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ మార్పులు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి.మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉందనే చర్చ ఉంది. రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఖైరతాబాద్, రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్ వంటి నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది.మొత్తంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 నియోజకవర్గాల్లో దాదాపు 15 చోట్ల ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం స్పష్టంగా ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇక కొన్ని నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ తిరిగి ఇవ్వని వారి శాతం కూడా గమనించదగ్గ స్థాయిలో ఉంది.

సనత్‌నగర్‌లో 45 శాతం, జూబ్లీహిల్స్‌లో 45 శాతం, ముషీరాబాద్‌లో 43 శాతం, ఎల్‌బీనగర్‌లో 44 శాతం ఫారాలు తిరిగి ఇవ్వలేదని లెక్కలు చెబుతున్నాయి. అయితే వీరంతా ఆంధ్రా సెటిలర్స్ అని చెప్పలేం కానీ.. ఈ నియోజకవర్గాల పరిధిలో ఆంధ్రా ప్రజలు ఎక్కువగా ఉంటున్నారన్నది నిజం. వాళ్లలో మెజారిటీ ఆంధ్రా ప్రాంతంలోనే ఓటుహక్కును కొనసాగించుకున్నారు. ఈ విషయంలు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా తెలిసింది. చాలా కాలనీల్లో “ మేం మా ఊళ్లలోనే ఓటును కొనసాగించుకుంటాం” అని చెప్పారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కొన్ని ప్రాంతాల్లో ఓట్ల తగ్గుదల గణనీయంగా కనిపిస్తోంది. శేరిలింగంపల్లిలో 3.2 లక్షలకు పైగా ఓట్లు తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా, దాదాపు 42 శాతం ఓట్లు తగ్గిన నియోజకవర్గంగా ఇది నిలిచింది. ఆ తర్వాత ఎల్‌బీనగర్‌లో 2.7 లక్షలు, రాజేంద్రనగర్‌లో 2.4 లక్షలు, మహేశ్వరంలో 2.3 లక్షల ఓట్లు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి.అయితే ఒక నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు తగ్గాయి అన్నది మాత్రమే రాజకీయంగా ముఖ్యం కాదు. ఎవరి ఓట్లు తగ్గాయి? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే ఓటర్ల సంఖ్య తగ్గడం ప్రతి పార్టీపై ఒకే విధమైన ప్రభావాన్ని చూపదు.ఈ మూడు జిల్లాల్లో హైదరాబాద్ జిల్లాకు ప్రత్యేక పరిస్థితి ఉంది. పాతబస్తీతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలను కలుపుకున్న హైదరాబాద్ జిల్లాలో 47 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు.

వారిలో దాదాపు 19 లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదని లెక్కలు చెబుతున్నాయి. అంటే దాదాపు 40 శాతం ఓటర్లపై ప్రభావం పడినట్టుగా కనిపిస్తోంది. పాతబస్తీ ప్రాంతంలో అనేక మంది ఓటర్లకు సరైన పత్రాలు లేకపోవడం, ప్రక్రియలో అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించలేకపోవడం వంటి కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమై ఉండవచ్చని చెబుతున్నారు. డాక్యుమెంట్లు ఇచ్చిన వారిలో కూడా 12లక్షల మందికి ఇక్కడ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే తొలగించబడిన ఓట్లతో పాటు మరో భారీ సంఖ్యలో ఓటర్లకు ఎన్నికల సంఘం నుంచి నోటీసులు వెళ్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో మరో 27 లక్షల ఓట్లకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. పత్రాల్లో తప్పులు, 2002 మ్యాపింగ్‌తో సరిపోని వివరాలు వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు.

ఈ ఓట్లలో ఎన్ని తిరిగి ధృవీకరించబడతాయి? ఎన్ని ఓట్లు తుది జాబితాలోకి వస్తాయి? అనేది తదుపరి ప్రక్రియలో తేలాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో 12లక్షల మందికి నోటీసులు వెళ్లాయి. తొలగించిన ఓట్లకు ఇవి అదనం.

తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా సెటిలర్స్... రాజకీయంగా కొంత ప్రభావం చూపించారు. వీరిలో కొంతమంది ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వారున్నారు. ఇప్పుడు ఓట్ల రివిజన్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోనుందా అన్న చర్చ మొదలైంది. ఇక్కడ సెటిలైన వారు.. హైదరాబాద్ ఓటర్లుగా పూర్తిగా మారారా?లేక... “మా ఓటు సొంత రాష్ట్రంలోనే కొనసాగాలి” అని నిర్ణయించుకున్నారా? అనే ప్రశ్న వస్తోంది. రెండో పరిస్థితి పెద్ద సంఖ్యలో నిజమైతే ఒక ఆసక్తికరమైన పరిస్థితి ఏర్పడుతుంది.

“హైదరాబాద్‌లో
ఆంధ్రా జనాభా కనిపిస్తుంది. కానీ ఆంధ్రా ఓటు కనిపించదు.”

ఇది హైదరాబాద్‌లోని రాజకీయ పార్టీలకు కీలకమైన అంశంగా మారే అవకాశం ఉంది.హైదరాబాద్‌లోని ఆంధ్రా సెటిలర్స్ ఓట్లన్నీ ఒకే పార్టీకి వెళ్తాయనే అభిప్రాయం కూడా పూర్తిగా సరైంది కాదు. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్‌గా ఉన్న సమయంలో ఆంధ్రా సెటిలర్స్‌లో కొంత మొగ్గు ఆ పార్టీ వైపు
ఉండేదనే రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కానీ ఇప్పుడు తెలంగాణ రాజకీయ పరిస్థితి మారిపోయింది. తెలంగాణలో ప్రధాన రాజకీయ పోటీ తెలంగాణకు చెందిన పార్టీల మధ్యనే సాగుతోంది. అందువల్ల ఓటర్ల సంఖ్య తగ్గడం వల్ల ఏ పార్టీకి ఎంత నష్టం? ఏ పార్టీకి ఎంత లాభం? అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పడం కష్టం.ా×= ప్రక్రియ కేవలం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ మాత్రమే. అయితే కేవలం మూడు జిల్లాల పరిధిలోనే దాదాపు 80లక్షల ఓట్లు తొలగిపోవడం, పెండింగ్‌లో ఉండటం అనేది.. చిన్న విషయం కాదు. ఇది భవిష్యత్‌లో రాజకీయంగా తీవ్ర ప్రభావాన్ని చూపించే అంశం. ముఖ్యంగా ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్యలో వచ్చిన మార్పులతో రాజకీయ పార్టీలు తమ ప్లానింగ్ మార్చుకోవలసి పరిస్థితి. ఇక ఏ ప్రభావాలకు లొంగని పాతబస్తీ ప్రాంతం కూడా ఈసారి కుదుపునకు గురైంది. ప్రత్యేకంగా ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో 35శాతం ఓట్లు తగ్గిపోయాయి. ఏకపక్ష మెజార్టీలతో గెలుస్తున్న కు ఇది కాస్త ఇబ్బందికరమే. ఇది గెలుపుపై ప్రభావం చూపకపోయినా.. మిగిలిన పార్టీలకు పోటీ ఇవ్వడానికి అవకాశం కల్పిస్తుంది. ఆంధ్రావాళ్ల ఓట్లన్నీ తెలంగాణ నుంచి వెళ్లిపోయావా..కు భారీ గండి పడబోతోందా అన్నది తుది ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాతనే తేలనుంది.

# లోకల్ పోరులో వైసీపీ

**విజయవాడ, ఆగస్టు 22, పెన్ పవర్:**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశాల్లో పార్టీ కేడర్‌కు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎక్కడా ఏకగ్రీవాలకు తావివ్వకూడదు, ప్రతి స్థానంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విధిగా బరిలో నిలబడి గట్టి పోటీ ఇవ్వాలి అని ఆదేశించారు. అయితే, 2021 స్థానిక ఎన్నికల్లో వేలాది పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవం చేసుకుని రికార్డు సృష్టించిన వైఎస్సార్‌సీపీ.. ఇవాళ ఏకగ్రీవాలు వద్దే వద్దు, పోటీ పడాల్సిందే అని పట్టుబట్టడం వెనుక కీలక రాజకీయ వ్యూహం ఉంది. గతంలో తమకు కలిసివచ్చిన ఏకగ్రీవ సూత్రాన్ని జగన్ ఇప్పుడు తీవ్రంగా వ్యతిరేకించడం వెనుక ప్రధానంగా కేడర్ నైతిక స్థైర్యం దెబ్బతిందనే ఆందోళన కనిపిస్తోంది. 2024 శాసనసభ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితమై దారుణ ఓటమిని చవిచూసిన తర్వాత, క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి హవా నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో పంచాయతీ లేదా మండల స్థాయిల్లో ఎన్నికలు వస్తే, అధికార పక్షం బెదిరింపులకో లేక ప్రలోభాలకో లొంగిపోయి వైఎస్సార్‌సీపీ నాయకులు నామినేషన్లు కూడా వేయకుండా వెనక్కి తగ్గుతారని జగన్ బలంగా సందేహిస్తున్నారు. బరిలోనే నిలబడకుండా ఏకగ్రీవాలకు సహకరిస్తే, అది పార్టీ క్షేత్రస్థాయి వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళుతుందనేది ఆయన భయం.పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున కూటమి వైపు లేదా అధికార టీడీపీ వైపు వలస వెళ్తారనే ఆందోళన. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకపోతే, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు తమ వ్యాపారాలు, కాంట్రాక్టులు, లేదా స్థానిక ఉనికిని కాపాడుకోవడానికి అధికార పార్టీతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకునే ప్రమాదం ఉంది. ఒకసారి స్థానిక నేతలు టీడీపీతో కరచాలనం చేస్తే, వారితో పాటు కింద ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకు కూడా చేజారిపోతుంది. ఈ రకమైన గ్రౌండ్ లెవెల్ మెల్ట్‌డౌన్ నిరోధించాలంటే.. వారిని బలవంతంగానైనా పోలింగ్ బరిలో నిలబెట్టి, పార్టీ రంగు పులుముకునేలా చేయడం తప్ప జగన్‌కు వేరే మార్గం కనిపించడం లేదు.అంతేకాకుండా, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో గనుక వైఎస్సార్‌సీపీ పోటీకి దూరంగా ఉండి లేదా నామమాత్రపు ప్రదర్శన ఇస్తే, దాని ప్రభావం రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి కోలుకోలేని దెబ్బగా మారుతుందని జగన్ మోహన్ రెడ్డి భావిస్తున్నారు. సాధారణంగా లోకల్ బాడీ ఎన్నికల్లో వచ్చే ఫలితాలు, అక్కడ నిలబడే అభ్యర్థుల పోరాట పటిమపైనే తదుపరి అసెంబ్లీ ఎన్నికల పునాది ఆధారపడి ఉంటుంది. పోటీ లేకుండా స్థానాలను కూటమికి అప్పగిస్తే, వైఎస్సార్‌సీపీ పని అయిపోయింది అనే నరేటివ్ ప్రజల్లోకి బలంగా వెళుతుంది. దీన్ని తిప్పికొట్టడానికే, ఏకగ్రీవాలను పూర్తిగా నిషేధించి, ప్రతి వార్డు, ప్రతి పంచాయతీలోనూ పోటీ వాతావరణాన్ని రగిల్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు.సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని, అధికార పార్టీ దాడిని, పోలీసు కేసులను తట్టుకుని పోటీ చేయడానికి చాలామంది వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంగా లేరన్న ప్రచారం జరుగుతోంది. గతంలో మాకు అధికారం ఉన్నప్పుడు ఏకగ్రీవాల పేరుతో ఇతరులను పోటీ చేయనివ్వలేదు.. ఇప్పుడు మేము పోటీ చేస్తామంటే కూటమి నేతలు ఊరుకుంటారా.. పైగా పార్టీ నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందనప్పుడు మేము ఎందుకు జైలు పాలవ్వాలి అని కొందరు స్థానిక నాయకులు అంతర్గత సంభాషణల్లో ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ ఏమేరకు నిలబడి పోరాడుతుందో, లేక జగన్ భయపడినట్లే కూటమి ఏకపక్ష విజయ సాధన వైపు దూసుకుపోతుందో వేచి చూడాల్సిందే!



# లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్

**విజయవాడ, ఆగస్టు 22, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదని తేల్చిచెప్పారు. ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపునిచ్చారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదిరించి జనసేన కార్యకర్తలు ధైర్యంగా నిలబడ్డ విషయాన్ని, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి చారిత్రాత్మక విజయానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేసిన అసమాన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్త రాజకీయ బలోపేతమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు మెరుగైన అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.స్థానిక ఎన్నికల విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధినేత ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, జనసేన పోటీ చేయడానికి తగిన స్థానాలు, పట్టున్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జనసేన శ్రేణుల మనోభావాలు, స్థానిక రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కూటమి ధర్మానికి భిన్నంగా జరుగుతున్న పరిణామాలు, జనసేన శ్రేణుల అసంతృప్తిపై సమావేశంలో ఎమ్మెల్యేలు పార్టీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్.. కార్యకర్తల మనోభావాలు, అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూనే, జనసేన బలం ఉన్న ప్రతిచోటా గౌరవప్రదమైన ప్రాతినిధ్యం దక్కేలా చూస్తామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన తన సత్తా చాటుతుందని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు.

జనసేన కేడర లో కొత్త జోష్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఈసారి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కూటమిలో పొత్తుకు భంగం కలగకుండా, తమకు నష్టం జరగకుండా స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే అభిప్రాయాన్ని త్వరలో చంద్రబాబు నాయుడు ముందు కూడా ఉంచనున్నారు. శాసనసభ ఎన్నికల తరహాలో తమ పార్టీకి తక్కువ స్థానాలు ఇవ్వాలన్న ఆలోచన ఉంటే వాటిని సరిచేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. 21 స్థానాల్లో పోటీ చేయడం అనేది అప్పటి పరిస్థితుల వరకే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వ్యూహం వర్తించదు.. జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవం కాపాడుతామని పవన్ కల్యాణ్ అనడం చర్చనీయాంశమైంది.. త్వరలోనే కమిటీలను నియమించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కూడా పవన్ నిర్ణయించారు. జనసేన శాసనసభ పక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెప్పారు. నేడు కేరళం కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. నేటి నుంచి 20 రోజులపాటు కేరళంలోని ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రంలో ఉండనున్న పవన్ చికిత్స చేయించుకోనున్నారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్న పవన్ కల్యాణ్ 20 రోజుల పాటు వైద్య శిబిరంలో పవన్ కల్యాణ్ చికిత్సను చేయించుకోనున్నారు. కేరళం నుంచి వచ్చిన వెంటనే చంద్రబాబుతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై చర్చించనున్నారు. జనసేనకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముప్పయి శాతం స్థానాలను దక్కేలా అవసరమైతే టీడీపీ పై వత్తిడి తేవాలని కూడా నిర్ణయించుకున్నారు. గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ ముఖ్యమైన సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ ప్రారంభోత్సవానికి రాలేదు. మంత్రి వర్గ సమావేశానికి రాలేదు. అసెంబ్లీ సమావేశాలకు చివరి రోజు హాజరై తన శాఖకు చెందిన బిల్లులు సభలో ప్రవేశ పెట్టి వెళ్లిపోయారు. టచ్ మి నాట్ గా ఉండటానికి తన అసంతృప్తి టీడీపీ నాయకత్వానికి తెలియజేయడానికేనని అంటున్నారు. మరి పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని సీట్లు సాధిస్తారన్నది చూడాల్సి ఉంది.

# తిరుమల అడవుల్లో రోబోట్ నిఘా

**తిరుపతి, ఆగస్టు 22, పెన్ పవర్:**
తిరుమల కొండల్లో భక్తుల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ టీటీడీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల కదలికలను ముందుగానే గుర్తించి, ప్రమాదం ఏర్పడే అవకాశాలను తగ్గించేందుకు ఆధునిక రోబోట్‌ను ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తోంది. ముఖ్యంగా మనుషులు వెళ్లడం కష్టంగా ఉండే ప్రాంతాల్లో ఈ పరికరం ద్వారా నిఘా పెట్టడం వల్ల అటవీ, భద్రతా సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి పద్మావతి అతిథిగృహం వద్ద రోబోట్ డాగ్ పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి దాని సామర్థ్యాలను తెలుసుకున్నారు. అడవుల్లో చిరుతలు, ఇతర జంతువుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దీనిని ఎలా వినియోగించవచ్చనే అంశంపై వివరాలు సేకరించారు. భక్తులు ప్రయాణించే మార్గాలకు సమీపంలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఇది ఎంతవరకు సహాయపడుతుందనే దానిపై కూడా చర్చించారు.ఈ నాలుగు కాళ్ల రోబోట్‌లో అనేక ఆధునిక పరికరాలు ఉన్నాయి. సాధారణ కెమెరాతో పాటు థర్మల్ ఇమేజింగ్ కెమెరా, 360 డిగ్రీల లైడార్, వివిధ రకాల సెన్సార్లు ఇందులో అమర్చారు. కృత్రిమ మేధ సాంకేతికతను కూడా ఉపయోగిస్తున్నారు. దీంతో వెలుతురు తక్కువగా ఉన్న సమయంలోనూ పరిసరాలను పరిశీలించే అవకాశం ఉంటుంది. పొగమంచు లేదా చీకటి వంటి పరిస్థితుల్లో కూడా కదులుతున్న జీవులు, మనుషులు, వాహనాలను గుర్తించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది.రోబోట్ సేకరించే సమాచారాన్ని కృత్రిమ మేధ ద్వారా విశ్లేషించి వివిధ వస్తువులు, జీవులను ప్రత్యేకంగా గుర్తించేలా రూపొందించారు. ఉదాహరణకు పెద్ద జంతువు కనిపిస్తే దాన్ని మనిషి లేదా వాహనంతో కలిపి చూడకుండా ప్రత్యేకంగా గుర్తించే సామర్థ్యం ఉంటుంది. ప్రమాదకరమైన ప్రాంతంలో వన్యప్రాణి కదలిక గుర్తించినప్పుడు దాని స్థానాన్ని ఆధారంగా చేసుకుని సంబంధిత సిబ్బందికి హెచ్చరికలు పంపే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నారు.అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే కాలిబాటకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాల్లో ఈ సాంకేతికత ప్రత్యేకంగా ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ మార్గంలో భక్తుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో వన్యప్రాణుల సంచారంపై ముందస్తు సమాచారం ఉంటే అప్రమత్త చర్యలు తీసుకోవచ్చు. అవసరమైతే భక్తులను సురక్షిత ప్రాంతాలకు మళ్లించడం, గస్తీ బృందాలను వెంటనే పంపడం వంటి చర్యలకు అవకాశం ఉంటుంది.అంతేకాకుండా రోబోట్ ద్వారా లభించే వీడియోలు, థర్మల్ దృశ్యాలు, ఇతర సమాచారాన్ని భద్రపరచి విశ్లేషిస్తే వన్యప్రాణులు ఏ ప్రాంతాల్లో, ఏ సమయాల్లో ఎక్కువగా సంచరిస్తున్నాయో తెలుసుకోవచ్చు. ఈ వివరాల ఆధారంగా అటవీ, విజిలెన్స్, భద్రతా విభాగాలు తమ గస్తీని మరింత సమర్థంగా నిర్వహించగలవు. భక్తుల రక్షణతో పాటు సిబ్బంది ప్రాణాలకు ప్రమాదం తగ్గించడం కూడా ఈ విధానం ద్వారా సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.తిరుమల వంటి సున్నితమైన అటవీ ప్రాంతంలో సంప్రదాయ నిఘాకు ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా టీటీడీ ముందడుగు వేస్తోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి రోబోటిక్ నిఘా వ్యవస్థలను వినియోగించే అవకాశం ఉంది.

## లోకల్ ఎన్నికలు కొంపముంచాతాయా? ఏంటి?

**నెల్లూరు, ఆగస్టు 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంతో పాటు ఎంతో సవాల్ గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామం నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీ యంత్రాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుంది. కార్యకర్తల్లో ఎన్నికలకు ముందు ఉత్సాహం లేదు. పదవులు లేవు. వారికి సరైన పనులు దక్కడం లేదు. ఇప్పటికీ అనేక నియోజకవర్గాల్లో వైసీపీ నేతలదే పెత్తనమని కార్యకర్తల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ భావిస్తున్నారు. వీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కమిట్ మెంట్ తో పనిచేస్తారన్నది మాత్రం లోలోపల పార్టీ నేతలకు కూడా సందేహంగానే కనిపిస్తుంది.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు ఒకలా... వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తుంది. గత సాధారణ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు పోరాడారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీ అగ్రనాయకత్వం హెచ్చరికలు చేస్తున్నా అత్యధిక సంఖ్యలో ఉన్న టీడీపీ శాసనసభ్యులు తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వారికే పనులు కట్టబెడుతున్నారు కానీ, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒరిగిన ప్రయోజనమేమీ లేదని బహిరంగంగానే పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా వాపోతున్నారు. కానీ వారి గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల మధ్య సయోధ్య లేకపోవడం కూడా మరొక తలనొప్పిగా తయారు కావచ్చు.. మరొకవైపు ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కూడా చూసీ చూడనట్లు పార్టీ నాయకత్వం వదిలేస్తుండటాన్ని కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీకి బూత్ లెవెల్ లో భారీ బలగం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కసి తీరా పనిచేస్తుందన్నది మాత్రం సందేహంగానే ఉంది. మరొకవైపు ప్రత్యక్ష ఎన్నికల విధానం కూడా పార్టీకి నష్టం తెచ్చి పెడుతుందని అంటున్నారు. బీసీ నినాదం ఎత్తుకున్నా అవి న్యాయస్థానాలు ఎంత మేరకు అంగీకరిస్తాయన్నది కూడా అనుమానమే. ఇప్పటికే రిజర్వేషన్లపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చూస్తే 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఈ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపించడం ల్లు. స్థానిక సంస్థల్లో 34శాతం బీసీ రిజర్వేషన్ల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. అయితే 16వ ఆర్థిక సంఘం నిధులను పొందడానికి, సకాలంలో స్థానిక సంస్థల పాలనను పునరుద్ధరించడం కోసం ఎన్నికలు నిర్వహించడం అవసరం. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఛాలెంజ్ అనే చెప్పాలి.

## శ్రావణమాసంతో పూజ వస్తువుల ధర రెట్టింపు

**విజయవాడ ఆగస్టు 22, పెన్ పవర్:**
శ్రావణ మాసం వచ్చిందంటే ప్రతి ఇల్లూ కళకళలాడిపోతుంది. పూజలు, వ్రతాలతో లక్ష్మీ కళ ఉట్టిపడుతుంది.హిందువులకు శ్రావణ మాసం వచ్చిందంటే పండగ వాతావరణమే. మహిళలు తాము ముస్తాబవ్వడమే కాకుండా ఇంటిని కూడా చూడచక్కని విధంగా అలంకరిస్తారు. దాంతో ప్రతి శుభకార్యంలో తప్పక కావాల్సిన తమలపాకు ధరకు రెక్కలు వచ్చాయి. ప్రతీ తాంబూలంలోనూ తమలపాకే ముఖ్యం. తమలపాకు లేనిదే ఏ శుభకార్యం కూడా జరగదు. దాంతో తమలపాకుతో పాటు అరటిపళ్లు, కొబ్బరి కాయలు, పూల రేట్లకు రెక్కలు వచ్చాయి.రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న చింతలపూడి, మాచవరం, ములుకుదురు ప్రాంతాల్లో తమలపాకు తోటలు ఉన్నాయి. రైతు వద్ద తక్కువకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. తమ కొట్లల్లో మాత్రం భారీగా అమ్మేస్తున్నారు. ఎందుకంటే పండగ సీజన్‌లో తమలపాకుకు ఉన్న డిమాండ్ అలాంటిది. రైతు వద్ద 150 ఆకుల కట్టను రూ. 16కు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. విడిగా ప్రజలకు మాత్రం ఒక్కొక్కటి రూపాయి చొప్పున విక్రయిస్తున్నారు. మంగళగిరి ప్రాంతంలో అయితే 30 ఆకులను రూ. 50 వరకు వసూలు చేస్తున్నారు.తమలపాకుతో పాటు కొబ్బరి కాయలు కూడా భారీగా పెరిగాయి. శ్రావణ మాసానికి ముందు కొబ్బరి కాయ సైజును బట్టి రూ. 15 నుంచి రూ. 35 మధ్య అమ్మేవారు. ప్రస్తుతం మీడియం సైజు కాయ ధరే రూ. 50 ఉంది. అరటి పళ్లు కూడా గతంలో డజను రూ. 40 నుంచి రూ. 60 వరకు అమ్మేవారు. ఇప్పుడు అదే అరటి కాయ ప్రాంతాన్ని బట్టి పెరిగిపోయింది. యావరేజ్‌గా రూ. 80 నుంచి రూ. 100 వరకు అమ్మేస్తున్నారు.వర్షాభావ పరిస్థితుల్లో పూలకు మంచి డిమాండ్ పెరిగింది. వర్షాలు సరిగా లేకపోవడంతో కాల్వల కింద, బోర్ల కింద పండిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. గతంలో రూ. 200 లోపే ఉండే చిట్టి గులాబీలు ఇప్పుడు రూ. 350 నుంచి రూ. 400 వరకు అమ్ముతున్నారు. చామంతులు రూ. 150 ఉంటే ఇప్పుడు రూ. 350 పెరిగింది. బంతి పూలు కిలో రూ. 30 ఉంటే రూ. 70కి పెరిగాయి. మొత్తానికి శ్రావణమాసంలో పూజలకు ఉపయోగించే సామగ్రి సామాన్యుడి నడ్డి విరుస్తుంది.

# ఎప్పూడూ ఆ నియోజకవర్గం రాజకీయమే

**అనంతపురం, ఆగస్టు 22, పెన్ పవర్:** రాష్ట్రంలో వైసీపీ వర్సెస్ టీడీపీ, జనసేన అనేలా చాలా నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ, ఓ నియోజకవర్గంలో మాత్రం 'అంతకుమించి' అన్నట్టుగా ఇరు పక్షాల మధ్య ముఖ్యంగా స్థానిక నేతల మధ్య రాజకీయాలు రగులుతున్నాయి. నానాటికీ ఈ రాజకీయ వ్యూహాలు.. పెరుగుతూనే ఉన్నాయి. అదే...ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం. ఇక్కడ జేసీ వర్సెస్ పెద్దారెడ్డి మధ్య రాజకీయాలు నిరంతరం నిప్పులు చెరుగుతూనే ఉన్నాయి ఇతర నియోజకవర్గాల్లోనూ వైసీపీ వర్సెస్ టీడీపీ అన్నట్టుగా రాజకీయాలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మరింత భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకుంటామని.. ఆయన నియోజకవర్గంలో అడుగు పెట్టేది కూడా లేదని శపథం చేసిన టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అలానే వ్యవహరిస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో రగులుతున్న ఏకైక నియోజకవ ర్గం కూడా ఇదే కావడం గమనార్హం... నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ఎక్కడైనా ఉంటుంది. తాడిపత్రిలో మాత్రం రాజకీయాలకు ఇస్తున్న ప్రాధాన్యం వైసీపీ హయాంలోను.. ప్రస్తుత కూటమి హయాంలోనూ అభివృద్ధిని మించి ఉంటోందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. యువ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా.. రాజకీయంగా జేసే వేస్తున్న అడుగుల కారణంగా.. అభివృద్ధిపై పెద్దగా చర్చ జరగడం లేదు. గత వైసీపీ దెబ్బతిన్నది కూడా ఇక్కడే. ముందుగా అభివృద్ధిపై ప్రచారం ఎక్కువగా ఉంటే.. అది అల్టిమేట్‌గా పార్టీలకు కలిసి వస్తుంది. అన్నట్టుగా తాడిపత్రి నియోజకవర్గం మారిపోవడం గమనార్హం. సహజంగా ఎన్ని కలకు ముందు రాజకీయాలు ఉంటాయి. కానీ, వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యేల మధ్య వ్యక్తిగత అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. దీనిని ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారు? అనే అంశంపైనే తాడిపత్రి నియోజకవర్గం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అంతకు మించి.. వ్యక్తిగత దూకుడును ప్రజలు అర్థం చేసుకుంటారా.. లేదా? అనేది చూడాలి. ప్రస్తుతం అయితే.. జేసీ హవా ఓ రేంజ్ లో సాగుతోందన్నది వాస్తవం.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఖజాగూడ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ వద్ద డివైడర్ను బైకు ఢీకొట్టింది. ఘటనలో ఒక్కరు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యయి. ఖజాగూడ నుండి అంజయ్య నగర్ వైపు వెళ్తుండగా, కేర్ =జు హాస్పిటల్ మెయిన్ రోడ్డు మలుపు వద్ద ప్రమాదం జరిగింది. బైక్పై వెళ్తున్న ముగ్గురు యువకులు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించారు. వెనుక కూర్చున్న అబ్బాస్ సిద్ధిక్ (25) అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న సహస్ర ఛటోపాధ్యాయ (25), అభిజిత్ సింగ్ (25)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులను తక్షణమే కేర్ హాస్పిటల్కు తరలించి చికిత్స అందిస్తున్నారు. రాయదుర్గం పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# కోచ్ లేడని సరూర్ నగర్ స్టేడియం ముందు అందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్ బి నగర్ లోని సరూ నగర్ ఇండోర్ స్టేడియం ముందు పేరెంట్స్ ఆందోళన కి దిగారు. 3 నేలలుగా క్రికెట్ కోచ్ రావడంలేదాంటూ ఆరోపోస్తూ ఆందోళనకి దిగారు. వెంటనే కొత్త క్రికెట్ కోచ్ ను ఏర్పాటు చేయాలనీ,డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఒకవైపు క్రీడాకారులు ఒలంపిక్ ఆడాలంటూ చెప్తుంటే ఇక్కడ మాత్రం క్రికెట్ కోచ్ లేకుండా మూడు నెలలు కాలయాపన చేస్తున్నారని తమ భవిష్యత్ పాడు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.క్రికెట్ కిట్ లు ఉన్న తమకి ఇవ్వడం లేదని జిల్లా కలెక్టర్ కి కూడా పిర్యాదు చేశామని తెలిపారు.తమకి వెంటనే క్రికెట్ కోచ్ నియమించాలని డిమాండ్ చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇంగ్లీష్ వెర్షన్‌తో 'బిలిబిలి' రాబోతోంది..

# యూట్యూబ్‌కు కొత్త ఛాలెంజ్!





ప్రపంచవ్యాప్తంగా వీడియో స్ట్రీమింగ్ రంగంలో శాసనం చేస్తున్న యూట్యూబ్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు చైనాకు చెందిన ప్రముఖ ప్లాట్‌ఫామ్ 'బిలిబిలి' సమాయత్తమవుతోంది. ఇప్పటివరకు ప్రధానంగా చైనీస్ భాషకే పరిమితమైన ఈ యాప్, ఇప్పుడు అంతర్జాతీయంగా తన సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు ఇంగ్లీష్ వెర్షన్‌తో గ్లోబల్ ఎంట్రీ ఇస్తోంది. ఇక విదేశీ క్రియేటర్లను, గ్లోబల్ యూజర్లను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన ఫీచర్లు మరియు మానిటైజేషన్ ఆప్షన్లను తీసుకువస్తూ సరికొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతోంది.

**గ్లోబల్ ఆడియన్స్ కోసం బిలిబిలి ప్లాన్స్:**
బిలిబిలి తన అంతర్జాతీయ యాప్‌ను సరికొత్తగా రీలాంచ్ చేయడమే కాకుండా, త్వరలోనే పూర్తిస్థాయి ఇంగ్లీష్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇక అంతర్జాతీయ క్రియేటర్లను ప్రోత్సహించడానికి అమెరికా, యూరప్, జపాన్ వంటి ప్రధాన దేశాల్లో కమ్యూనిటీ మేనేజర్లను నియమించుకుంటోంది. అంతేకాకుండా, గ్లోబల్ యూజర్లు సులభంగా సైన్-అప్ అయ్యేలా గతంలో ఉన్న పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు కార్డుల నిబంధనను కూడా తొలగించి ప్రక్రియను చాలా సరళతరం చేసింది.

**జెన్ జీ యూజర్లే టార్గెట్:**
ప్రస్తుతం చైనాలో బిలిబిలికి దాదాపు 37.6 కోట్ల నెలవారీ యాక్టివ్ యూజర్లు ఉన్నారు. మిస్టర్ బీస్ట్ వంటి ప్రముఖ గ్లోబల్ క్రియేటర్లు ఇప్పటికే ఇందులో కంటెంట్ పోస్ట్ చేస్తూ మిలియన్ల మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఇక ముఖ్యంగా బాగా చదువుకుని, ఆధునిక ఆలోచనలు ఉన్న 'జెన్ జెడ్' యువతను టార్గెట్ చేస్తూ బ్రాండ్ స్పాన్సర్‌షిప్‌ల కోసం ప్రత్యేక మార్కెట్‌ప్లేస్‌ను కూడా బిలిబిలి డెవలప్ చేస్తోంది.

**బిలిబిలి ముందున్న ప్రధాన సవాళ్లు:**
యూట్యూబ్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నప్పటికీ, బిలిబిలికి గ్లోబల్ మార్కెట్‌లో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇక ఇతర చైనీస్ యాప్‌ల మాదిరిగానే బిలిబిలికి కూడా సెన్సార్‌షిప్, డేటా సెక్యూరిటీ మరియు కంటెంట్ మోడరేషన్ వంటి విషయాల్లో అంతర్జాతీయ నియంత్రణ సంస్థల నుంచి గట్టి నిఘా ఎదురవుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సింగపూర్ కేంద్రంగా పవర్ ఫుల్-ా× కంటెంట్ మోడరేషన్ సిస్టమ్‌ను బిలిబిలి రూపొందిస్తోంది. చైనా సరిహద్దులు దాటి ప్రపంచ వేదికపై యూట్యూబ్‌తో తలపడేందుకు బిలిబిలి వేస్తున్న అడుగులు డిజిటల్ కంటెంట్ సృష్టికర్తలకు ఒక కొత్త అవకాశంగా మారనున్నాయి. ఇక మరి డేటా భద్రత, సెన్సార్‌షిప్ వంటి సవాళ్లను దాటుకుని ఈ చైనీస్ దిగ్గజం గ్లోబల్ మార్కెట్‌లో యూట్యూబ్‌ను ఎంతవరకు దాటగలదో వేచి చూడాలి.

# సర్కారు సలహాదారులు ఎక్కడ ?



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మీద అనేక ఆరోపణలు, వివిధ శాఖల్లో తీసుకున్న నిర్ణయాల మీద తీసుకుంటున్న నిర్ణయాల మీద వ్యతిరేకతలు పెల్లుబుకుతున్నాయి. సామాన్యుల నుండి విద్యార్థుల వరకు ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం వివిధ శాఖలలో నియమించుకున్న ప్రభుత్వ సలహాదారులు ఎక్కడ అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.తెలంగాణ ప్రభుత్వానికి 10 మంది క్యాబినెట్ హోదా కలిగిన ప్రభుత్వ సలహాదారులు ఉన్నారు. భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి, బీసీ సంక్షేమ మరియు అభివృద్ధి సలహాదారుగా వి.హనుమంతరావు, పబ్లిక్ అఫైర్స్ సలహాదారుగా కె.కేశవరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సలహాదారుగా షబ్బీర్ అలీ, వ్యవసాయ సలహాదారుగా పోచారం శ్రీనివాస్ రెడ్డి, ప్రోటోకాల్, పబ్లిక్ రిలేషన్స్ సలహాదారుగా హర్కర వేణుగోపాల్ రావు, అభివృద్ధి పథకాల అమలు సలహాదారుగా పి.సుదర్శన్ రెడ్డి, నీటిపారుదల సలహాదారుగా ఆదిత్యనాథ్ దాస్, పట్టణ రవాణా సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి, క్రీడా శాఖ సలహాదారుగా ఏపీ జితేందర్ రెడ్డిలు ఉన్నారు.

ముఖ్యమంత్రి ప్రజా వ్యవహారాల సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడుగా వెళ్లే ముందు దానికి అధికారికంగా రాజీనామా చేసినా, అనధికారింగా కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. వీరు కాకుండా తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సలహాదారులుగా అభిజిత్ బెనర్జీ, రఘురామ్ రాజన్, దువ్వూరి సుబ్బారావు, కిరణ్ మంజుదార్ షాలు ఉన్నారు. ఇక నీటిపారుదల శాఖ సలహాదారుగా ఉన్న ఆదిత్యానాథ్ దాస్ తనకు సహాయకులుగా మరో ఇద్దరు సలహాదారులను నియమించుకున్నారు.మరి ఇంత మంది సలహాదారులు ప్రభుత్వానికి ఏం సలహాలు ఇస్తున్నారన్న చర్చ మొదలయింది. హైడ్రాతో సామాన్యులలో మొదలైన 22ఎ నిషేధిత భూములకు సంబంధించి కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టడం హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలతో పాటు రాష్ట్రం మొత్తం అలజడి రేపుతున్నది. హైదరాబాద్ లో దశాబ్దాల కింద ప్లాట్లు కొనుక్కుని అన్ని అనుమతులతో ఇండ్లు కట్టుకుని, బ్యాంకులో లోన్లు తీసుకున్న సామాన్యులు ఇప్పుడు ఏదైనా అవసరానికి వాటిని అమ్మేందుకు వెళితే నిషేధిత జాబితాలో ఉన్నట్లు చూయిస్తుండడంతో గందరగోళం మొదలయింది.ఇక స్వయంగా విద్యా శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలిటెక్నిక్ విద్యను శక్తి పథకం కిందకు తీసుకువస్తూ జీఓ 97 విడుదల చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షలకు పైగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు రోడ్లెక్కారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ లు చేస్తున్నారు. ఒక పోలీసు అధికారి విద్యార్థి గొంతు పట్టుకోవడంతో ఆయనను విధుల నుండి తప్పించారు.పాలిటెక్నిక్ డిప్లొమా తర్వాత తాము నేరుగా బీ టెక్ రెండో సంవత్సరంలో చేరే లేటరల్ ఎంట్రీ విధానం ఈ పథకం ద్వారా రద్దు అవుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా పాలిటెక్నిక్ విద్య ప్రమాణాలు తగ్గించి ఐటీఐ శిక్షణ స్థాయికి మార్చడం మూలంగా తమ డిగ్రీ విలువ కోల్పోతుంది అన్నది వారి ఆవేదన. అందుకే జీఓ 97 రద్దు చేయాలని ఆందోళన చేస్తున్నారు.అటు రెవెన్యూ శాఖలో 22 ఎ, ఇటు విద్యా శాఖలో జీఓ 97 రాష్ట్రంలో అలజడికి కారణం అయ్యాయి. దశాబ్దాల కష్టంతో సంపాదించుకున్న సంపద నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో సామాన్యులు ఆవేదన చెందుతుంటే, 18 ఏళ్లు నిండని విద్యార్థులు తమ భవిష్యత్తు మీద ఆందోళనతో రోడ్డెక్కారు. మరి ఇంత మంది సలహాదారులు ఈ పరిణామాలను పసిగట్టి ప్రభుత్వానికి అప్రదిష్టం రాకుండా ఎందుకు అరికట్టలేకపోతున్నారు అన్నది సమాధానం లేని ప్రశ్నగానే మిగులుతుంది.

# ఆరు గంటల ధర్నా.. ఒక ఎఫ్ఐఆర్.. జెన్ జెడ్ కోసం రాహుల్ పోరాటం వెనుక అసలు రాజకీయ సందేశం

ఢిల్లీ పోలీస్ స్టేషన్ ముందు ఆరు గంటలకుపైగా కూర్చున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. చివరకు ఒక ఎఫ్ఐఆర్ నమోదయ్యే వరకు వెనక్కి తగ్గలేదు. జులై 20న జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళనలో 19 ఏళ్ల సహిల్ లోచబ్‌కు పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఫిర్యాదు నమోదు చేయాలంటూ రాహుల్ గాంధీ ఆగస్టు 21న ఢిల్లీ పోలీసులను డిమాండ్ చేశారు. పోలీసులు తొలుత స్పందించకపోవడంతో ఆయన పోలీస్ స్టేషన్ బయటే ధర్నాకు కూర్చున్నారు. ఆ తర్వాత ఒక ఎఫ్ఐఆర్ నమోదైంది. అయితే ఈ ఘటనను కేవలం "రాహుల్ గాంధీ ధర్నా చేసి ఒక ఎఫ్ఐఆర్ సాధించారు" అనే కోణంలో చూడటం కంటే.. భారత రాజకీయాల్లో మారుతున్న ప్రతిపక్ష రాజకీయానికి ఒక సంకేతంగా చూడాల్సిన అవసరం ఉంది.



**ఇది రాహుల్ గెలుపా? లేక వ్యవస్థపై ఒక ప్రశ్నా?**
ఒక ఎఫ్ఐఆర్ నమోదవడం అంటే ఆరోపణలు నిజమని నిర్ధారణ అయినట్టు కాదు. ప్రస్తుతం కేసులో గుర్తుతెలియని వ్యక్తులపై ఒక ఎఫ్ఐఆర్ నమోదైనట్లు సమాచారం. అసలు పెల్లెట్లు ఎవరు ప్రయోగించారు? ఏ పరిస్థితుల్లో ప్రయోగించారు? బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు దర్యాప్తులోనే సమాధానం రావాలి. అందుకే ఈ ఘటనలో అసలు రాజకీయ విజయం ఒక ఎఫ్ఐఆర్ కంటే పెద్దది. "ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోతే.. ప్రతిపక్షం ప్రజా ఒత్తిడిని సృష్టించగలదా?" అనే ప్రశ్నకు రాహుల్ తన చర్యతో ఒక సమాధానం ఇవ్వాలని ప్రయత్నించారు.

**జెన్ జెడ్ ఆందోళన.. రాజకీయ పార్టీలకు కొత్త సవాలు**
ఈ వివాదానికి కేంద్రబిందువు యువత. జులై 20న జరిగిన విద్యార్థుల నిరసనలో భద్రతా బలగాలు అధిక బలప్రయోగం చేశాయనే ఆరోపణలు వచ్చాయి. పెల్లెట్ గన్ వినియోగంపై ఢిల్లీ పోలీస్ వర్గాల నుంచి భిన్నమైన వాదనలు కూడా వెలువడ్డాయి. ఒకవైపు పోలీసులు పెల్లెట్లు ఉపయోగించలేదని చెప్పగా మరోవైపు పెల్లెట్ల వినియోగంపై పలు ఆధారాలు, ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.

**ఇక్కడే జెన్ జెడ్ రాజకీయ ప్రాధాన్యం బయటపడుతోంది.**
ఇది సంప్రదాయ రాజకీయ పార్టీలు నిర్వహించిన ర్యాలీ కాదు. యువతకు సంబంధించిన అంశంపై వచ్చిన నిరసన. అలాంటి ఉద్యమంపై పోలీస్ చర్య జరిగిందనే ఆరోపణలు వస్తే.. అది కేవలం ఒక న్యాయపరమైన అంశంగా ఉండదు. అది యువతలో ప్రభుత్వంపై నమ్మకం, నిరసన హక్కు, పోలీస్ జవాబుదారీతనం వంటి పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతుంది.

**"నేను వెళ్లను" అన్న రాహుల్ వ్యూహం ఎందుకు కీలకం?**
రాహుల్ గాంధీ తన ధర్నాలో "ఎఫ్ఐఆర్ నమోదయ్యే వరకు ఇక్కడే ఉంటాను" అన్న వైఖరిని తీసుకున్నారు. అవసరమైతే 30 రోజులు, ఆరు నెలలు అయినా కూర్చుంటానని ఆయన చెప్పడం సంచలనమైంది. ఒక ప్రతిపక్ష నేత స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, బాధితుడిని వెంట తీసుకెళ్లి, అధికారులను కలిసి, స్పందన రాకపోతే అక్కడే ధర్నాకు కూర్చోవడం ద్వారా "ప్రతిపక్షం కేవలం పార్లమెంట్‌లో మాట్లాడే వేదిక కాదు" అనే సందేశాన్ని ఇవ్వాలని ప్రయత్నించారు.

**అదే ఈ ఘటనలో రాహుల్ రాజకీయ వ్యూహం.**
వాస్తవాలను పరిశీలిస్తే ఎఫ్ఐఆర్ నమోదవడం నేరం రుజువైనట్టు కాదు... అలాగే ప్రధాని నరేంద్ర మోదీ లేదా హోంమంత్రి అమిత్ షా వ్యక్తిగతంగా ఆదేశాలు మార్చినట్లు కాదు.. ఎందుకంటే ఎఫ్ఐఆర్ తర్వాత అసలు పోరాటం మొదలవుతుంది. దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందా? బాధ్యులను గుర్తిస్తారా? పెల్లెట్ గన్ నిజంగా ఎవరు ఉపయోగించారు? అధికారుల పాత్ర ఏమిటి? బాధితుడికి న్యాయం జరుగుతుందా? ఇవే ఇప్పుడు కీలక ప్రశ్నలు.

**మరో ఆసక్తికరమైన ట్విస్ట్.. పెల్లెట్ గన్ రాజకీయ చరిత్ర**
ఈ వివాదంలో మరో రాజకీయ వ్యంగ్యం కూడా ఉంది. పెల్లెట్ గన్స్ వినియోగం భారతదేశంలో కొత్తగా వచ్చిన పద్ధతి కాదు. ఇవి యూపీఏ ప్రభుత్వ కాలంలోనే క్రౌడ్ కంట్రోల్ కోసం వినియోగంలోకి వచ్చాయని కొన్ని రిపోర్టులు పేర్కొంటున్నాయి. అంటే నేడు కాంగ్రెస్ ప్రశ్నిస్తున్న ఒక వ్యవస్థకు గతంలో కాంగ్రెస్ పాలనలోనే పునాది పడిందన్న విమర్శ కూడా వినిపిస్తోంది. ఇది రాహుల్‌కు రాజకీయంగా ఒక ఇబ్బందికరమైన ప్రశ్నను కూడా ముందుకు తెస్తుంది. "అప్పుడు సరైనదైతే ఇప్పుడు ఎందుకు తప్పు? ఇప్పుడు తప్పైతే అప్పుడూ ఎందుకు ప్రశ్నించలేదు?" అయితే గతంలో తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుత ఘటనపై జవాబుదారీతనాన్ని తప్పించుకోవడానికి కారణం కావు. ప్రస్తుతం జరిగిన ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు జరగాలన్న డిమాండ్ మాత్రం స్వతంత్రంగా పరిశీలించాల్సిన అంశమే. ఎఫ్ఐఆర్ సాధించడం రాజకీయ విజయం కావచ్చు.. కానీ ఎఫ్ఐఆర్ లోని నిజాన్ని బయటకు తీయడం మాత్రమే అసలు విజయం.

## కరిచాక కుక్కలా మారాడు.. కానీ బతికాడిలా..

# వైద్యులకే షాకిచ్చిన 15 ఏళ్ల కరణ్ కథ

రేబీస్ అంటేనే భయం. సాధారణంగా కుక్క కాటు తర్వాత సరైన సమయంలో వ్యాక్సిన్ తీసుకోకపోతే వైరస్ నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రేబీస్ లక్షణాలు బయటపడిన తర్వాత ప్రాణాలతో బయటపడే అవకాశాలు అత్యంత అరుదు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌కు చెందిన 15 ఏళ్ల కరణ్ విషయంలో మాత్రం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గతేడాది డిసెంబర్‌లో కరణ్‌ను ఓ కుక్క కరిచింది. అయితే అప్పట్లో అతడు రేబీస్ వ్యాక్సిన్ తీసుకోలేదు. రోజులు గడిచేకొద్దీ పరిస్థితి తీవ్రంగా మారింది. చివరకు రేబీస్‌కు సంబంధించిన తీవ్రమైన లక్షణాలు కనిపించడం ప్రారంభించాయి. నీళ్లు తాగేందుకు ప్రయత్నించినా భయపడటం, మింగలేకపోవడం వంటి లక్షణాలతో పాటు అతడు కుక్కలా అరవడం ప్రారంభించాడు. పరిస్థితి చూసిన వైద్యులు కూడా అతడి ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందేనని కుటుంబ సభ్యులకు చెప్పినట్లు సమాచారం.

**22 రోజులు.. 5 వ్యాక్సిన్లు**
అయితే కరణ్ కుటుంబ సభ్యులు అతడిని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రత్యేక చికిత్స అందిస్తూ 22 రోజుల వ్యవధిలో ఐదు రేబీస్ వ్యాక్సిన్లు ఇచ్చినట్లు సమాచారం. వైద్యుల నిరంతర పర్యవేక్షణలో చికిత్స కొనసాగింది. అందరూ ఊహించిన దానికి భిన్నంగా కరణ్ పరిస్థితిలో క్రమంగా మార్పు వచ్చింది. తీవ్ర లక్షణాలు ఉన్నప్పటికీ అతడు చికిత్సకు స్పందించి ప్రాణాలతో బయటపడ్డాడు.



**ఎందుకు ఇది అరుదైన ఘటన?**
రేబీస్‌లో లక్షణాలు ప్రారంభమైన తర్వాత వ్యాధి అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. అందుకే కుక్క, పిల్లి లేదా ఇతర అనుమానాస్పద జంతువులు కరిచినప్పుడు లక్షణాలు వచ్చే వరకు వేచి చూడకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యంత కీలకం.కరణ్ ఘటన ఒకవైపు వైద్య రంగంలో అరుదైన పరిణామంగా ఆసక్తిని రేకెత్తిస్తుండగా.. మరోవైపు జంతువుల కాటు విషయంలో నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో గుర్తుచేస్తోంది. అయితే ఈ ఘటనను చూసి రేబీస్ లక్షణాలు వచ్చిన తర్వాత వ్యాక్సిన్ తీసుకుంటే తప్పకుండా బతుకుతామని భావించకూడదు. రేబీస్‌కు గురయ్యే అవకాశం ఉన్నప్పుడు వెంటనే వైద్య సహాయం పొందడం, వైద్యులు సూచించే పోస్ట్-ఎక్స్‌పోజర్ చికిత్సను సమయానికి పూర్తి చేయడమే ప్రాణాలను కాపాడుకునే అత్యంత ముఖ్యమైన మార్గం. కరణ్ ప్రాణాలతో బయటపడటం నిజంగా అరుదైన పరిణామమే అయినప్పటికీ.. ఈ కథలోని అసలు సందేశం మాత్రం ఒక్కటే.. కుక్క కాటు చిన్నదిగా కనిపించినా రేబీస్ విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.

## వీడియోలు తీస్తే రూ.8.5 లక్షల జీతం.. ఇదేం ఉద్యోగం రా సామీ..

మనదేశంలో ప్రతీ సోమవారం పొద్దున్నే లేచి "ఛా.. మళ్లీ ఆఫీస్‌కు వెళ్లాలా?" అని నెత్తి కొట్టుకుంటూ ల్యాప్‌టాప్‌ల ముందు కూర్చుని హెచ్‌ఆర్‌కు పిచ్చి పిచ్చి సాకులు చెప్పే కార్పొరేట్ దాసులకు ఈ వార్త చెంపపెట్టు లాంటిది. మనం ఇక్కడ తొమ్మిది గంటల పాటు బాస్‌ల తిట్లు తింటూ కాఫీలు తాగుతూ సీవీలు అప్‌డేట్ చేస్తుంటే.. చైనాలో ఒక కుర్రాడు మాత్రం కేవలం ఆకాశంలో వెళ్లే మేఘాలను చూస్తూ వాటిని ఫోన్‌లో షూట్ చేస్తూ నెలకు రూ. 8.5 లక్షలు (60 వేల యువాన్లు) జేబులో వేసేసుకుంటున్నాడు. అవును మీరు విన్నది నిజమే.. మన కలల ఉద్యోగం నిజంగానే ఉనికిలో ఉంది.

చైనాలోని ప్రముఖ 'లావోజున్ మౌంటైన్' టూరిజం సంస్థ 'క్లౌడ్ స్కేప్ అబ్జర్వర్' అంటే మన భాషలో 'మేఘాల కాపలాదారు' అనే ఉద్యోగానికి నోటిఫికేషన్ ఇస్తే ఏకంగా 3,500 మంది "మమ్మల్ని దయామయులై ఆదుకోండి" అంటూ అప్లై చేశారు. అందులో అదృష్టం వరించి 23 ఏళ్ల లి సించెన్ అనే కుర్రాడికి ఈ జాబ్ దక్కింది.

**ఏం చేయాలి ఈ ఉద్యోగంలో?**
ఏముంది.. ప్రశాంతంగా పర్వతం ఎక్కి నిలబడాలి. ఉదయం సూర్యోదయం నుంచి సాయంత్రం సూర్యాస్తమయం వరకు మేఘాలు ఏ వైపు తిరుగుతున్నాయో వాటి ఆకారాలు ఎటు మారుతున్నాయో కెమెరాలో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాలి. బాస్ డెడ్‌లైన్లు లేవు.. జూమ్ కాల్స్ అసలే లేవు, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ల గొడవే లేదు. ఏడాదికి దాదాపు రూ. 1 కోటి జీతం. ఈ విషయం తెలిసాక, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ కోడింగ్ బుక్స్ పక్కన పడేసి లైట్ హౌస్ పక్కన నిలబడే ఉద్యోగాలు ఎక్కడున్నాయో గూగుల్‌లో వెతుక్కుంటున్నారు.



**సవాలు ఏంటో తెలుసా?**
అయితే ఈ ఉద్యోగంలో కూడా ఒక పెద్ద సవాలు ఉందండోయ్.. పర్వతం మీద వాతావరణం క్షణాల్లో మారిపోతుందట. ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడం.. వర్షం పడటం లేదా పొగమంచు కమ్మేయడం జరుగుతుందట. అంటే.. గాలి వస్తే గొడుగు పట్టుకుని కెమెరా సరిగ్గా పట్టుకోవడమే అక్కడ పెద్ద 'టెక్నికల్ చాలెంజ్' అన్నమాట.. ఆఫీస్‌లో క్లయింట్ ఇచ్చే టాస్క్‌లతో పోలిస్తే ఈ మేఘాల సవాలు ఎంత ముద్దుగా ఉందో కదూ?

ఏది ఏమైనా "రోజంతా ఆకాశం వైపు చూస్తూ ఖాళీగా తిరుగుతున్నావు" అని ఇంట్లో తిట్టే తల్లిదండ్రులకు ఈ చైనా కుర్రాడి వార్త చూపించి "నేను ఖాళీగా లేను.. ఇంటర్నేషనల్ క్లౌడ్ అబ్జర్వర్ జాబ్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నా" అని చెప్పే ధైర్యాన్ని ఈ వార్త అందరికీ ఇచ్చింది.

చొచ్చుకొస్తోన్న కృత్రిమ మేధ .. చదువు నేర్చు విధానాన్నీ వేగంగా మారుస్తోంది. సో, స్కూళ్లు, కాలేజీలను పాఠాల చోటుగాకాకుండా, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే చోటుగా చూడాలి. కంప్యూటర్లు, ఇంటర్నెట్, స్మార్ట్ యాప్‌లు పిల్లలు ఎలా నేర్చుకుంటారో, ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకుంటారో మార్చేస్తున్నాయి. దీంతో ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతోంది. చదువు అంటే ఉద్యోగం కోసం టెక్నికల్ స్కిల్స్ నేర్పించడమేనా? లేక పిల్లలను ఆలోచించేలా, మంచి-చెడు తేడా తెలుసుకునేలా కూడా తీర్చిదిద్దాలా? దీనికి సమాధానంగా, మన దేశంలో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 తీసుకొచ్చారు. ఇది పిల్లలు ఒకే సబ్జెక్టుకు కట్టుబడిపోకుండా, వేర్వేరు సబ్జెక్టులను కలిపి నేర్చుకునే వెసులుబాటు ఇస్తుంది. మూడేళ్లు లేదా నాలుగేళ్ల డిగ్రీ కావాలా అన్నది పిల్లలే ఎంచుకోవచ్చు. మధ్యలో చదువు ఆపేసినా, ఆ వరకూ నేర్చుకున్నదానికి సర్టిఫికెట్ ఇచ్చే వెసులుబాటు కూడా ఇందులో ఉంది. చదువు అంటే కేవలం ఉద్యోగం సంపాదించడం మాత్రమే కాదని, సొంతగా ఆలోచించగలిగే, బాగా మాట్లాడగలిగే, సమాజానికి ఉపయోగపడే మనుషులను తయారు చేయడం కూడా చదువు లక్ష్యమని ఈ విధానం చెబుతోంది. దీంతో, పిల్లలకు సమాచారం అందించడమే కాదు, ఆ సమాచారాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం, దాన్ని ప్రశ్నించడం, సరైన రీతిలో వాడుకోవడం కూడా నేర్పించాల్సిన అవసరముంది. ఏఐ మనుషుల స్థానాన్ని ఆక్రమించకూడదు, మనుషుల సామర్థ్యాన్ని పెంచడానికే ఉపయోగపడాలి. అందుకే, ఏది నిజమో ఏది అబద్ధమో గుర్తించగలగడం, లోతుగా ఆలోచించగలగడం, మంచి ప్రశ్నలు అడగగలగడం ఇప్పుడు మరింత విలువైనవిగా మారుతున్నాయి. కేవలం కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటే సరిపోదు, సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలించడం, కొత్త ఆలోచనలు తేవడం, ఇతరులతో కలిసి పనిచేయడం, మానవత్వంతో కూడిన సమస్యా పరిష్కారం చేయగలగడం కూడా అవసరం. చదువులో టెక్నికల్ సబ్జెక్టులతోపాటు, చరిత్ర, తత్వశాస్త్రం, రాజకీయ శాస్త్రం, సమాజశాస్త్రం లాంటి సబ్జెక్టులను కూడా కలిపి నేర్పిస్తే, పిల్లలు ఏదైనా విషయాన్ని ప్రశ్నించడం, ఆధారాలను పరిశీలించడం, సమాజంలోని సంక్లిష్టతలను అర్థం చేసుకోవడం నేర్చుకుంటారు. ఇలాంటి నైపుణ్యాలను కేవలం మెషిన్లు, కంప్యూటర్లు నేర్పించలేవు. ఫేక్ న్యూస్, డీప్‌ఫేక్ వీడియోలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్న ఈ కాలంలో, ఏది నిజమో ఏది కాదో గుర్తించే శక్తిని ఇలాంటి చదువే ఇస్తుంది. చుట్టూ ఉన్నవారు ఏం చెబితే అది గుడ్డిగా నమ్మేయడం కాకుండా, సొంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకునే గుణాన్ని కూడా ఈ చదువు నేర్పిస్తుంది. నిజమైన చదువు అంటే పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడం. కేవలం బట్టీ పట్టడం కాకుండా, జ్ఞానం, నైపుణ్యాలు, మంచి విలువలు కూడా నేర్పించాలని యూజీసీ కూడా చెబుతోంది.


ప్రశ్నించడం, ఆధారాలతో ఆలోచించడం నేర్పిస్తే, పిల్లలు సమాచారాన్ని సరిగ్గా అర్థం చేసుకుని, సమాజంపై నమ్మకాన్ని పెంచుకుంటారు. సైన్స్‌తోపాటు మానవీయ శాస్త్రాలను కూడా కలిపి నేర్పిస్తే, పిల్లలు సంక్లిష్టమైన విషయాలను అర్థం చేసుకోగలుగుతారు. ఏది సరైనదో ఏది కాదో నిర్ణయించుకోగలుగుతారు. చదువు లక్ష్యం కేవలం జ్ఞానం సంపాదించడం మాత్రమే కాదు, బాగా చదవడం, స్పష్టంగా రాయడం, విశాలంగా ఆలోచించడం, తెలివిగా వ్యవహరించడం కూడా. ఈనాటి

## జ్ఞానానికి కొత్త దిక్సూచి!

సవాళ్లను ఎదుర్కోవాలంటే కేవలం సాంకేతిక జ్ఞానం సరిపోదు, కుతూహలంతో ప్రశ్నించే మనస్తత్వం కావాలి. చరిత్ర సబ్జెక్టు ఆధారాల ప్రాముఖ్యతను నేర్పిస్తుంది. ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవాలంటే దాని వెనుక ఉన్న నేపథ్యం, సందర్భం తెలుసుకోవాలని చెబుతుంది. తత్వశాస్త్రం ఆలోచనా శక్తికి పదును పెడుతుంది. తప్పుడు వాదనలను గుర్తించడం నేర్పిస్తుంది. రాజకీయ శాస్త్రం ప్రభుత్వ వ్యవస్థలు, అధికారం ఎలా పనిచేస్తాయో వివరిస్తుంది. సాహిత్యం ఇతరుల బాధను అర్థం చేసుకునే గుణాన్ని, వేర్వేరు దృక్కోణాల నుంచి విషయాలను చూసే సామర్థ్యాన్ని పెంచుతుంది. సమాజశాస్త్రం మనుషుల ప్రవర్తనను సంస్కృతి, సంప్రదాయాలు ఎలా ప్రభావితం చేస్తాయో చూపిస్తుంది. ఇవన్నీ కలిసి, పిల్లలు ప్రశ్నించడం, సరైనదేదో నిర్ణయించుకోవడం, సంక్లిష్ట విషయాలను అర్థం చేసుకోవడం నేర్చుకుంటారు. సరైన నిర్ణయం తీసుకునే జ్ఞానమే మనిషికి అతిపెద్ద బలంగా మిగిలిపోతుంది. ఇది వ్యక్తులు నైతిక తీర్పులు తీసుకోవడానికి, సొంత ఆలోచనలను కాపాడుకోవడానికి, సమాచారాన్ని విమర్శనాత్మకంగా చూడటానికి, ప్రజాస్వామ్య ప్రక్రియల్లో బాధ్యతగా పాల్గొనడానికి తోడ్పడుతుంది.

ఇప్పుడు జ్ఞానం అందరికీ సులభంగా అందుబాటులో ఉంది. కాబట్టి చదువు పిల్లలను ప్రపంచస్థాయిలో ఆలోచించేలా తీర్చిదిద్దాలి. నేటి పిల్లలు కృత్రిమ మేధతోపాటు సాంఘిక శాస్త్రాలను, డేటా సైన్స్‌తోపాటు మనస్తత్వశాస్త్రాన్ని కలిపి నేర్చుకుంటున్నారు. పర్యావరణ సమస్యలను సైన్స్ కోణంలోనూ, చరిత్ర కోణంలోనూ, సమాజం కోణంలోనూ అర్థం చేసుకుంటున్నారు. ఇలాంటి విద్య టెక్నికల్ నైపుణ్యంతోపాటు, మానవత్వం, మంచి తీర్పు, సృజనాత్మకత, మారుతున్న పరిస్థితులకు తగినట్టు మారగల గుణంలాంటి లక్షణాలను పెంచుతుంది. డేటా సైన్స్ తెలిసిన తత్వవేత్త ఈనాటి సమస్యలను బాగా అర్థం చేసుకోగలడు. ఏఐ గురించి తెలిసిన పాలకుడు డిజిటల్ సమాజాన్ని బాగా నడిపించగలడు. మంచి విద్యార్థి అంటే కేవలం ఒక సబ్జెక్టులో నిపుణుడు కావడం కాదు, అలాగని అన్ని సబ్జెక్టుల గురించి కొంచెం కొంచెం తెలిసిన సాధారణ వ్యక్తీ కాదు. వేర్వేరు రంగాల జ్ఞానాన్ని కలిపి ఆలోచించగల, సంక్లిష్ట పరిస్థితులకు తగినట్టు మారగల, టెక్నికల్ నైపుణ్యంతోపాటు మానవీయ అవగాహన కూడా ఉన్న వ్యక్తి. చదువు భవిష్యత్తు కేవలం కంప్యూటర్ నాలెడ్జ్‌తోనే నిర్ణయం కాదు. ఏఐ క్షణాల్లో సమాధానాలు ఇచ్చే ఈ కాలంలో, అసలైన సవాలు -ప్రశ్నించగల, చర్చించగల, తెలివైన నిర్ణయాలు తీసుకోగల మనుషులను తయారు చేయడమే. ఇలాంటి సమగ్రమైన చదువు పిల్లల్లో కుతూహలాన్ని, మంచి-చెడు వేరు చేయగల శక్తిని, సృజనాత్మకతను, సామాజిక బాధ్యతను పెంచుతుంది. భారత్ ప్రపంచంలోనే జ్ఞాన కేంద్రంగా ఎదగాలంటే, మన కాలేజీలు కేవలం నైపుణ్యం ఉన్నవారిని కాదు, ఆలోచించే పౌరులను కూడా తయారు చేయాలి. ప్రశ్నించే మనస్తత్వం ఇప్పుడు కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాదు, అది కొత్త ఆవిష్కరణలకు, ప్రజాస్వామ్యానికి, మంచి జీవితానికి పునాదిగా మారింది. తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా, సామాజికంగా మనం కూడా పిల్లలకు కేవలం మార్కులు, ర్యాంకుల కోసమే కాకుండా, జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలుకూ ధైర్యంగా, తెలివిగా ఎదురొడ్డి నిలబడే శక్తిని ఇచ్చేలా చదువును తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది!

## పనికొచ్చే పలుకు




## మళ్లీ మొదలుపెట్టడం వైఫల్యం కాదు

ఒక వయసు దాటగానే.. జీవితంలో స్థిరపడిపోవాలని సమాజం అనధికారిక నియమాన్ని రుద్దుతుంది. 30 ఏళ్లు దాటితే కెరీర్ మార్చుకోవడం "రిస్క్", 40కి చేరితే కొత్త స్కిల్ నేర్చుకోవడం "అనవసరం", 50 దాటితే కొత్తగా ఏదైనా ప్రారంభించడం "అసాధ్యం" అన్న భావనను సమాజం బలవంతంగా రుద్దుతుంది. కానీ ఈ ఆలోచనే అతిపెద్ద అపోహ. జీవితాన్ని మళ్లీ మొదలుపెట్టాల్సి రావడం వైఫల్యం కాదు, అది ధైర్యానికి, స్వీయ అవగాహనకు నిదర్శనం. ఈ ఆలోచన వెనుక ఉన్న మనస్తత్వశాస్త్రాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. మనం తరచూ "సంక్ కాస్ట్ ఫాలసీ"కి బలైపోతుంటాం. అంటే, ఇప్పటికే ఒక రంగంలో సంవత్సరాలు వెచ్చించామన్న కారణంతో, అది మనకు నచ్చకున్నా.. మనల్ని సంతోషపెట్టకున్నా.. అందులోనే కొనసాగుతూ ఉండిపోతాం. "ఇన్నేళ్లు కష్టపడ్డాను కదా, ఇప్పుడు మార్చుకుంటే ఆ శ్రమంతా వృథా" అనుకుంటాం. కానీ నిజం చెప్పాలంటే, గతంలో పెట్టిన శ్రమను తిరిగి పొందలేం. భవిష్యత్తులో ఏం చేయాలో మాత్రమే మనం నిర్ణయించుకోగలం. కొత్తగా మొదలుపెట్టడం కాస్త కష్టం అనిపించినా, ఉన్నచోటే ఉండిపోవడం వల్ల జరిగే నష్టమే ఎక్కువ. అసంతృప్తితో గడిపే ప్రతి రోజూ, తిరిగి రాని విలువైన సమయమే.


శాస్త్రీయంగా చూసినా, మెదడు వయసుతో సంబంధం లేకుండా కొత్త విషయాలు నేర్చుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని 'న్యూరోప్లాస్టిసిటీ' అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. 20 ఏళ్లలో ఎంత సులభంగా నేర్చుకోగలమో, 50 ఏళ్లలోనూ అంతే సామర్థ్యంతో నేర్చుకోగలం. తేడా ఏమిటంటే, వయసు పెరిగే కొద్దీ మనం ఎక్కువగా అనుభవాన్ని, జీవిత పాఠాలను తోడుగా తీసుకెళ్తాం. ఇది కొత్త ప్రయత్నాలను మరింత పరిణతితో నిర్వహించడానికి సాయపడుతుంది.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన ఆంగ్ల కోట్ ప్రస్తావించదగినది: *It is never too late to be what you might have been.* ఇది సాధారణంగా ప్రఖ్యాత రచయిత్రి జార్జ్ ఎలియట్‌కు ఆపాదిస్తారు, అయితే నిజాయితీగా చెప్పాలంటే -ఈ కోటేషన్ ఆమె రచనల్లో ఎక్కడా కనిపించదని పరిశోధకులు నిర్ధారించారు. ఆమె మరణించిన ఏడాది తర్వాత (1881) ఒక పత్రికలో మొదటిసారి ఇది కనిపించింది, తర్వాత ఆమెకు ఆపాదిస్తూ ప్రాచుర్యం పొందింది. అయితే, ఈ మాటలో ఉన్న సందేశం మాత్రం ఎవరు చెప్పినా అమూల్యమైనదే. మీరు కావాలనుకున్న వ్యక్తిగా మారడానికి ఎప్పుడూ ఆలస్యం కాదు అన్నదే దాని సారాంశం.

మీ నిత్యజీవితంలో ఈ సూత్రాన్ని ఎలా అన్వయించుకోవచ్చో ఆలోచిద్దాం. మొదటిది, "ఇప్పుడు మొదలుపెడితే చాలా ఆలస్యం" అనే ఆలోచనను వదిలేయండి. ఐదేళ్ల తర్వాత మీరు ఎలాగూ ఐదేళ్లు పెద్దవారవుతారు, ఆ సమయాన్ని కొత్త నైపుణ్యంతోనే ఎందుకు గడపకూడదు? రెండోది, పెద్ద మార్పులను చిన్న చిన్న అడుగులుగా విభజించండి. ఒక్కసారిగా మొత్తం జీవితాన్ని తారుమారు చేయాల్సిన అవసరం లేదు, రోజుకు ఒక చిన్న అడుగు చాలు. మూడోది, మీలాంటి మార్పు కోరుకునేవారి సాంగత్యాన్ని పెంచుకోండి. వారి అనుభవాలు మీకు ధైర్యాన్నిస్తాయి.

గుర్తుంచుకోండి - మెరుగైన జీవితాన్ని నిర్మించుకోవడానికి వయసును అడ్డంకిగా చూడకండి. మీ కథ ఇంకా ముగియలేదు, అది ఏ వయసులోనైనా కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టగలదు!

# సీబీఎన్.. 'వన్ సౌత్ వన్ విజన్'!




దక్షిణ భారతదేశాన్ని ఒకే సమగ్ర ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర ప్రతిపాదనతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టిని ప్రదర్శించారు. మహాబలిపురంలో ఇటీవల జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన ప్రతిపాదించిన 'వన్ విజన్.. వన్ సౌత్' ప్రణాళిక, 2047నాటికి దక్షిణాదిని 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రూపొందింది. నదులు కలవాలి, నగరాలు నిలవాలి, ఆర్థిక వ్యవస్థలు బలపడాలన్నదే ఈ ప్రణాళిక సారాంశం. ఒక నది మరో నదితో కలవడం, ఒక నగరం మరో నగరంతో హైస్పీడ్ రైలు ద్వారా అనుసంధానమవడం, ఒక రాష్ట్రంలోని విద్యుత్ మరో రాష్ట్ర పారిశ్రామిక అవసరాలు తీర్చడం, ఒక రాష్ట్ర నైపుణ్య సంస్థ మరో రాష్ట్రంలోని పరిశ్రమలకు మానవ వనరులను అందించడం -ఇవన్నీ విడివిడిగా చేసేవి కావు, ఒకే దారంతో కలిపితేనే 'మెగా విజన్' అనిపించుకుంటాయి. ఈ ప్రతిపాదనల్లో అత్యంత దీర్ఘకాలిక ప్రభావం చూపగల అంశం నదుల అనుసంధానం. దక్షిణ భారతదేశంలో నీటి వనరుల పంపిణీ అసమానంగా ఉందన్నది కాదనలేని వాస్తవం. గోదావరి, మహానది వంటి బేసిన్లలో మిగులు జలాలు ఉండగా, కృష్ణా, పెన్నా, కావేరి, వైగై వంటి బేసిన్లు నీటిలోటును ఎదుర్కొంటున్నాయని జాతీయ జల అభివృద్ధి సంస్థ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి నుంచి కృష్ణా, పెన్నా మీదుగా కావేరి బేసిన్‌కు 500 టీఎంసీకి పైగా మిగులు వరద జలాలు తరలించే ప్రతిపాదనను చంద్రబాబు కేంద్రం ముందుంచారు. అయితే, నదీ అనుసంధానికి అసలు సవాలు ఇంజినీరింగ్ కాదు, అంతర్రాష్ట్ర సమ్మతి, నీటి హక్కులు, ట్రిబ్యునల్ తీర్పులు, పర్యావరణ అనుమతులువంటి సంక్లిష్టతలను పరిష్కరించాలి. అందుకే దక్షిణాది నదీ బేసిన్ల మధ్య ప్రత్యేక సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నది మరో కీలక ప్రతిపాదన. ఒక్కో ప్రాజెక్టును ఒక్కో రాష్ట్ర సమస్యగా కాకుండా, మొత్తం దక్షిణాదిని ఒక జలవనరుల వ్యవస్థగా చూడాలన్నదే ఇందులోని అసలైన సందేశం. వాతావరణ మార్పుల నేపథ్యంలో, భారత్ జనాభా ప్రపంచంలో 18 శాతం ఉన్నా, ప్రపంచ తీపినీటి వనరుల్లో వాటా కేవలం 4 శాతమేనన్న నీతి ఆయోగ్ విశ్లేషణను దృష్టిలో ఉంచుకుంటే, నీటి భద్రతను వచ్చే తరాల మౌలిక వసతిగా చూడాల్సిన అవసరాన్ని ఈ ప్రతిపాదన మరింత బలంగా చాటుతోంది. గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలన్న మరో విస్తృత ఆలోచనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా మద్దతు తెలపడం గమనార్హం, అయితే ఇలాంటి భారీ ప్రాజెక్టులను చేపట్టేముందు సమగ్ర పర్యావరణ, సామాజిక అధ్యయనాలు తప్పనిసరి అన్న విషయాన్ని విస్మరించకూడదు.

చంద్రబాబు ప్రతిపాదనల ప్రత్యేకత నీటి అనుసంధానానికే పరిమితం కాలేదు. అమరావతి-బెంగళూరు-చెన్నైలను అనుసంధానించే హైస్పీడ్ రైల్ కారిడార్‌ను కూడా ఆయన ప్రతిపాదించారు. ఇది కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించే రైలు కాదు, పరిపాలన-కొత్త నగర నిర్మాణానికి కేంద్రమైన అమరావతిని, ఐటీ-స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి కేంద్రమైన బెంగళూరును, ఆటోమొబైల్-పోర్టు వాణిజ్యానికి కీలక కేంద్రమైన చెన్నైను ఒకే ఆర్థిక కారిడార్‌గా మార్చే బృహత్తర అవకాశం. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఏడు కొత్త హైస్పీడ్ రైల్ కారిడార్లలో హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు మార్గాలు ఇప్పటికే ప్రక్రియలో ఉన్నాయి. వీటినే ఒక సమగ్ర దక్షిణాది కారిడార్‌గా అనుసంధానించే విజన్‌గా చంద్రబాబు ప్రతిపాదనను చూడాలి. దీనికితోడు, చెన్నై, ఎన్నోర్, కృష్ణపట్నం, కాకినాడ, విశాఖపట్నం, కొచ్చి, మంగళూరువంటి పోర్టులను ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌గా అనుసంధానించి, డ్రైపోర్టుల ద్వారా పరిశ్రమలు-రైళ్లు-జాతీయ రహదారులు-అంతర్జాతీయ మార్కెట్లను వేగంగా కలిపే ప్రతిపాదనలో వ్యూహాత్మక ప్రాధాన్యత కనిపిస్తోంది. ఇదే తమిళనాడు ముఖ్యమంత్రి సీ. జోసెఫ్ విజయ్ ప్రతిపాదించిన సమగ్ర ఆర్థిక, లాజిస్టిక్స్ క్లస్టర్ల ఆలోచనతోనూ కలవడం విశేషం.

విద్యుత్ రంగంలోనూ ఇదే సమన్వయ విధానం అవసరమని, ఒక ప్రాంతంలో అధికంగా ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను మరో ప్రాంత పారిశ్రామిక డిమాండ్‌కు అనుసంధానించేలా దక్షిణాది గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో మరింత సమర్థంగా కలపాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అదేవిధంగా, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధ వంటి భవిష్యత్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలంటే, రాష్ట్రాలుగా వేర్వేరుగా కాకుండా ఉమ్మడి నైపుణ్యాభివృద్ధి వ్యవస్థతో ఒక పెద్ద ప్రతిభా మార్కెట్‌గా దక్షిణాది ఎదగాలన్నది ఆయన ఆలోచన. దక్షిణాది ఆధ్యాత్మిక కేంద్రాలైన తిరుపతి, శ్రీశైలం, మదురై, రామేశ్వరాలను వారణాసి, అయోధ్యతో అనుసంధానించే తీర్థయాత్ర సర్క్యూట్ ప్రతిపాదన కూడా, కేవలం ఆధ్యాత్మిక పర్యాటకానికే పరిమితం కాకుండా, హోటళ్లు, రవాణా, హస్తకళలతో కూడిన పూర్తిస్థాయి టూరిజం ఎకానమీని సృష్టించే అవకాశాన్ని చూపుతుంది.

దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా ఉన్నాయి. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అధ్యయనం ప్రకారం 2023-24లో దక్షిణాది వాటా భారత జీడీపీలో సుమారు 30.6 శాతం. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లి, 2047 నాటికి దక్షిణ భారతాన్ని 10 ట్రిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే సామర్థ్యం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్యం సాధించాలంటే ప్రతి రాష్ట్రం విడివిడిగా తన వృద్ధిని పెంచుకుంటే సరిపోదు. ఒక రాష్ట్ర బలం మరో రాష్ట్రానికి మార్కెట్‌గా, సరఫరా గొలుసుగా, మానవ వనరుగా, మౌలిక వసతుల భాగస్వామిగా మారాలన్నదే ఈ మొత్తం ప్రణాళిక వెనుక ఉన్న ఆలోచన. దీన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే -రాష్ట్రాల మధ్య పోటీని తగ్గించి, పరస్పర ఆధారిత వృద్ధిని పెంచడం. అయితే, ఇలాంటి బృహత్తర ప్రతిపాదనల అసలు పరీక్ష అవి కేవలం ప్రకటనలుగా మిగిలిపోకుండా, వాస్తవ ప్రాజెక్టులుగా మారడంలోనే ఉంది. ప్రతి ప్రతిపాదనకు నిర్దుష్ట కాలపరిమితితో కూడిన డీపీఆర్, స్వతంత్ర శాస్త్రీయ మూల్యాంకనం, రాష్ట్రాల మధ్య పారదర్శక నీటి లెక్కలు, పర్యావరణ రక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటివి తప్పనిసరి. చంద్రబాబు ప్రతిపాదనల్లోని అసలైన దూరదృష్టి ఏ ఒక్క ప్రాజెక్టులోనో లేదు. వాటన్నింటినీ ఒకే భవిష్యత్ దక్షిణాది మ్యాప్‌లో చూడటంలోనే ఉంది. గోదావరి నీరు కావేరిని చేరితే అది కేవలం నీటి ప్రయాణం కాదు, ఒక రాష్ట్రపు వనరు మరో రాష్ట్రపు భద్రతకు ఆధారమయ్యే సహకారానికి సంకేతం. అమరావతి నుంచి బెంగళూరు, చెన్నైకి హైస్పీడ్ రైలు పరుగెత్తితే అది మూడు నగరాల ఆర్థిక వ్యవస్థలను ఒకదానితో ఒకటి ముడిపెట్టే ప్రక్రియ. ఈ విజన్ సాకారం కావాలంటే కావాల్సింది కేవలం ప్రకటన కాదు, స్పష్టమైన రోడ్‌మ్యాప్. అదే జరిగితే, గోదావరి నుంచి కావేరి వరకు, అమరావతి నుంచి చెన్నై వరకు, విద్యుత్ గ్రిడ్ నుంచి స్కిల్ గ్రిడ్ వరకు దక్షిణాది భవిష్యత్ అభివృద్ధి కథ ఒకే దిశలో కదిలే అవకాశం మెండుగా కనిపిస్తుంది. చంద్రబాబు ప్రతిపాదనల అసలైన బలం - సరిహద్దులను గుర్తించే పరిపాలన నుంచి, సరిహద్దులను దాటి ఆలోచించే అభివృద్ధి దిశగా వేస్తున్న అడుగులోనే దాగి ఉంది. ■



"చేయాలి" అనే భారంతో కాకుండా, "చేసే అవకాశం నాకే దక్కింది" అనే కృతజ్ఞతతో ప్రతి పనినీ చూడండి. ఈ చిన్న దృక్పథ మార్పే, జీవితంలో ఎన్నో సమస్యలను తేలికపరుస్తుంది. ఇవాళ మనం విసుక్కుంటూ చేసే పనులు - పిల్లలతో గడపడం, తల్లిదండ్రుల బాధ్యతలు, రోజువారీ కష్టాలు - వయసు మీద పడ్డాక వాటినే మళ్లీ ఒక్కసారైనా చేయగలిగితే బాగుండని కోరుకుంటాం. ప్రతి క్షణం విలువైనదే, దాన్ని బరువుగా కాకుండా వరంగా చూడండి.

-మహాదేవ


## వింతల్లో వింతలు

### జనసంద్రంలో ఇసుక తిన్నె



ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే బీచ్ -చైనా షెన్‌జెన్‌లోని దామీషా. కేవలం 1.8 కిలోమీటర్ల పొడవున్న ఇసుక తీరం, వారాంతాల్లో మనుషుల సముద్రమైపోతుంది. వేసవిలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందంటే, సముద్రం వరకూ కూడా చేరుకోలేకపోయామని పర్యాటకులు ట్రిప్ అడ్వైజర్‌లో ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. దీంతో అధికారులు మేనుంచి అక్టోబర్ వరకూ రోజువారీ సందర్శకుల సంఖ్యను 80వేలకు పరిమితం చేస్తూ, తప్పనిసరి రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అయినప్పటికీ, కొన్నిసార్లు ఏకంగా 2 లక్షలమంది వరకూ ఇక్కడ గుమిగూడటం విశేషం. ఈత కొట్టడం మాట అటుంచి, కదలడానికే వీలులేని పరిస్థితి. ఉచిత ప్రవేశం, బీచ్ ఎదురుగానే మెట్రో స్టేషన్ ఉండటం, పలు బస్సు మార్గాలు అందుబాటులో ఉండటం వంటివి జనాదరణకు కారణాలట. ఇలాంటి రద్దీ ఉన్నా, వేసవిలో దామీషా బీచ్ ఫొటోలు తరచూ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి.

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..




మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.

## ఆహారాల్లో తేడాలే కారణం..

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బోహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## ప్రోబయోటిక్స్ ఆపేయాలా..

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రెయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

## ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయో మ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

# విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా ? నిపుణులు ఏం చెబుతున్నారంటే..

ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు. విటమిన్ బి12 నాడులు సక్రమంగా పనిచేయడానికి, మెదడు మధ్య సమాచార మార్పిడికి అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల శరీరంలో బి12 తగినంతగా లేకపోతే ఆందోళన, చిరాకు, భయాందోళన, మానసిక స్థితిలో మార్పులు, తక్కువ ఉత్సాహం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. విటమిన్ బి12ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. మెదడు పనితీరు, నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల తయారీ, డీఎన్‌ఏ నిర్మాణం వంటి అనేక ముఖ్యమైన ప్రక్రియలకు ఇది అవసరం. శరీరం తగినంత బి12ను స్వయంగా తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా పొందాలి. చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చికెన్, మాంసం వంటి వాటిలో విటమిన్ బి12 లభిస్తుంది.

## నాడీ వ్యవస్థ ఆరోగ్యానికి..

నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటంలో విటమిన్ బి12కి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నరాలపై ఉండే మైలిన్ అనే రక్షణ పొరను నిర్వహించడంలో ఇది సహాయపడుతుంది. ఈ రక్షణ పొర సరిగ్గా ఉంటే మెదడు, వెన్నుపాము, శరీరంలోని ఇతర భాగాల మధ్య విద్యుత్ సంకేతాలు సక్రమంగా ప్రసారం అవుతాయి. బి12 లోపం ఏర్పడినప్పుడు నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎర్ర రక్త కణాల తయారీలోనూ బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి ప్రభావితమై మెగాలోబ్లాస్టిక్ అనీమియా వంటి సమస్యలు ఏర్పడతాయి. దాంతో శరీరానికి ఆక్సిజన్ సరఫరా సరిగా జరగక అలసట, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెదడు ఆరోగ్యానికి కూడా బి12 అవసరం. ఈ విటమిన్ స్థాయిలు చాలా తక్కువగా ఉన్నప్పుడు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యంలో మార్పులు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన లోపం ఉన్నప్పుడు మరింత తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

## ఆందోళన పెరుగుతుందా..

విటమిన్ బి12 లోపం ఆందోళన లక్షణాలను పెంచడానికి ఒక కారణం అవుతుందని చెబుతున్నారు. శరీరంలో బి12 తక్కువగా ఉన్నప్పుడు మెదడు పనితీరుకు అవసరమైన కొన్ని రసాయన ప్రక్రియలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా హోమోసిస్టీన్ అనే పదార్థాన్ని మెథియోనిన్‌గా మార్చే ప్రక్రియలో బి12 అవసరం. ఈ ప్రక్రియ మెదడు పనితీరు, మానసిక స్థితి నియంత్రణకు సంబంధించిన జీవరసాయన చర్యల్లో భాగం. బి12 లోపం వల్ల అలసట, బలహీనత, మెదడు మబ్బుగా అనిపించడం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇవి రోజువారీ పనితీరుపై ప్రభావం చూపడంతో కొందరిలో ఆందోళన మరింత ఎక్కువగా అనిపించే అవకాశం ఉంటుంది. అలాగే నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినడం వల్ల చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కొన్నిసార్లు పానిక్ అటాక్ లక్షణాలను పోలి ఉంటాయి.

## ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు శారీరక లక్షణాలతోపాటు నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. తీవ్రమైన అలసట, బలహీనత, చర్మం పాలిపోయినట్లు కనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, సమతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి సమస్యలు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఆందోళన, చిరాకు, డిప్రెషన్, మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇలాంటి లక్షణాలు కనిపించిన ప్రతిసారీ బి12 లోపమే కారణమని భావించకూడదు. ఆందోళనకు అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయి. కొంతమందిలో విటమిన్ బి12 లోపం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పూర్తిగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారిలో బి12 లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. సహజంగా బి12 లభించే మొక్కల ఆధారిత ఆహార పదార్థాలు చాలా తక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణం. వయసు పెరిగే కొద్దీ బి12 శోషణ తగ్గే అవకాశం ఉన్నందున వృద్ధుల్లోనూ లోపం కనిపిస్తుంది.

## జీర్ణ వ్యవస్థ సమస్యలు ఉంటే..

జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఉన్నవారిలోనూ ఆహారం నుంచి బి12 శరీరంలోకి శోషించుకోవడం తగ్గుతుంది. అలాగే మెట్‌ఫార్మిన్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి కొన్ని మందులను దీర్ఘకాలం ఉపయోగించే వారు కూడా బి12 స్థాయిలపై వైద్యుల సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బి12 లోపం ఉన్నవారికి లోపాన్ని సరిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అయితే బి12 స్థాయిలు సాధారణంగా ఉన్న ప్రతి ఒక్కరూ అదనంగా బి12 సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. సాధారణ బి12 స్థాయిలు ఉన్నవారిలో కేవలం సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా ఆందోళన గణనీయంగా తగ్గుతుంది. ఎప్పటికప్పుడు లేదా నిరంతరం ఆందోళనగా అనిపించడం, కారణం తెలియని తీవ్రమైన అలసట, చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, జ్ఞాపకశక్తి సమస్యలు, సమతుల్యతలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఉంటే విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం గురించి వైద్యుడిని సంప్రదించవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలంగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారు బి12 స్థాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

## వైద్య పరీక్షలు అవసరం..

విటమిన్ బి12 లోపం కొన్ని సందర్భాల్లో ఆందోళనను పోలిన లక్షణాలకు లేదా నాడీ సంబంధిత సమస్యలకు కారణం అవుతుంది. అయితే ఆందోళనకు బి12 లోపమే ఏకైక కారణమని చెప్పలేం. లక్షణాలను బట్టి సరైన వైద్య పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. బి12 లోపం నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు ఆహారం లేదా సప్లిమెంట్ల ద్వారా దాన్ని సరిచేసుకోవాలి.



# భోజనం చేశాక పండ్లను తినాలా.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?


భోజనం తర్వాత పండ్లు తినడం ఆరోగ్యకరమైన అలవాటుగా చాలామంది భావిస్తారు. ముఖ్యంగా మామిడి, యాపిల్, బొప్పాయి వంటి పండ్లను భోజనం అనంతరం స్వీట్లకు ప్రత్యామ్నాయంగా తీసుకోవడం సాధారణం. అయితే భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో పులిసిపోయి గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తాయనే వాదనలు తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఈ వాదనల్లో వాస్తవం ఎంత? నిజంగా పండ్లను ఎప్పుడు తింటే మంచిది? నిపుణుల సూచనల ప్రకారం ఇలా ఉన్నాయి. భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో కుళ్లిపోతాయనే వాదనకు శాస్త్రీయ ఆధారం లేదు. మన కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉంటుంది. దీని ఆమ్లత్వం కారణంగా కడుపులో పండ్లు బ్యాక్టీరియా ద్వారా పులిసిపోయే పరిస్థితి ఉండదు. అయితే పండ్లను కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు అధికంగా ఉన్న భోజనం తర్వాత తీసుకుంటే కడుపు ఖాళీ కావడానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది. ఇది జీర్ణక్రియలో సహజమైన ప్రక్రియే తప్ప, ఏదైనా సమస్యకు సంకేతం కాదు.

## పీచు పదార్థంతో మేలు..

పండ్లలో ఉండే కరిగే పీచు పదార్థం, ముఖ్యంగా యాపిల్, సిట్రస్ పండ్లలో లభించే పెక్టిన్, కడుపు నుంచి ఆహారం బయటకు వెళ్లే వేగాన్ని కొంత తగ్గిస్తుంది. దీని వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే ఆహారంలోని పోషకాలు శరీరంలోకి క్రమంగా శోషించేందుకు ఇది సహాయపడుతుంది. వేగంగా రక్తంలో చక్కెర పెరగకుండా కూడా పీచు కొంతవరకు సహకరిస్తుంది. అయితే భోజనంతోపాటు లేదా వెంటనే పండ్లు తినడం వల్ల ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన అనుభవం ఉండదు. ఖాళీ కడుపుతో పండ్లు తింటే వాటిలోని సహజ చక్కెరలు చిన్న ప్రేగులకు వేగంగా చేరుతాయి. భోజనం తర్వాత పండ్లు తింటే ప్రధాన ఆహారంలోని పీచు, ప్రోటీన్, కొవ్వు కారణంగా జీర్ణక్రియ కొంత నెమ్మదిస్తుంది. ఫలితంగా ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటానికి ఇది సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిల విషయంలోనూ పండ్లను భోజనంతో కలిపి తీసుకోవడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా టైప్-2 మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు పండ్లను ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంత నియంత్రణలో ఉండే అవకాశం ఉంటుంది. అయితే వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి ఆహార ఎంపికలు మారుతాయి.

## సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

మరోవైపు సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి మాత్రం భోజనం చేసిన వెంటనే ఎక్కువ మొత్తంలో పండ్లు తినడం అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా పుచ్చకాయ, బేరి, ద్రాక్ష వంటి ఫ్రక్టోజ్ అధికంగా ఉండే పండ్లను ఇప్పటికే నిండుగా ఉన్న కడుపుపై ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే గ్యాస్, పొట్ట ఉబ్బరం, అసౌకర్యం వంటివి కనిపిస్తాయి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (IBS) ఉన్నవారిలో ఈ సమస్య మరింత స్పష్టంగా ఉంటుంది. భోజనంతో పాటు పండ్లు తీసుకోవడం వల్ల మరో ప్రయోజనం కూడా ఉంటుంది. విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, జామ, కివీ వంటి పండ్లు పప్పులు, పాలకూర, సంపూర్ణ ధాన్యాల్లో ఉండే మొక్కల ఆధారిత ఇనుము శరీరంలో శోషించేందుకు సహాయపడతాయి. అందువల్ల కొన్ని సందర్భాల్లో ప్రధాన భోజనంతో పండ్లు తీసుకోవడం పోషకాల శోషణకు ఉపయోగకరంగా ఉంటుంది. పండ్లు తినడానికి ఒకే ఒక్క ఉత్తమ సమయం అంటూ కచ్చితమైన నియమం లేదు. పండ్లను ఎప్పుడు తింటున్నామన్న దానికంటే రోజువారీ ఆహారంలో వాటిని తగిన పరిమాణంలో చేర్చుకోవడం ముఖ్యం. భోజనం తర్వాత పండ్లు తిన్నప్పుడు బరువుగా లేదా పొట్ట ఉబ్బరంగా అనిపిస్తే, వాటిని భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో లేదా సాయంత్రం 4 గంటల సమయంలో చిరుతిండిగా తీసుకోవడం కూడా ఒక ఎంపిక.



## ఏ సమయంలో తినాలి..

పండ్లను ఎక్కువ పరిమాణంలో ఒకేసారి తినకుండా తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. ఉదాహరణకు చిన్న యాల్ లేదా కొద్దిగా బెర్రీలు సరిపోతాయి. ముఖ్యంగా అధిక కేలరీల భోజనం చేసిన వెంటనే పెద్ద గిన్నె నిండా పండ్లు తినడం అవసరం లేదు. పండ్ల రసాల కంటే సంపూర్ణ పండ్లకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. పండ్లను రసంగా మార్చినప్పుడు పీచు పదార్థంలో కొంత భాగం తొలగిపోతుంది. దీంతో సహజ చక్కెరలు శరీరంలోకి వేగంగా చేరే అవకాశం ఉంటుంది. సంపూర్ణ పండ్లలోని పీచు జీర్ణక్రియను నియంత్రించడంలో, రక్తంలో చక్కెర వేగంగా పెరగకుండా చూడడంలో సహాయపడుతుంది. గ్యాస్ట్రో-ఈసోఫేజియల్ రిఫ్లక్స్ (+జు=ణ) సమస్య ఉన్నవారు కూడా పండ్ల ఎంపిక, సమయంపై కొంత జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లు తీసుకోవడం వల్ల కొందరిలో యాసిడ్ రిఫ్లక్స్ లక్షణాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న చాలా మందికి భోజనం చేసిన వెంటనే పండ్లు తినడం హానికరం కాదు. పండ్లు కడుపులో కుళ్లిపోవడం లేదా పులిసిపోవడం వల్ల జీర్ణక్రియ దెబ్బతింటుందనే వాదనకు ఆధారం లేదు. అయితే సున్నితమైన జీర్ణవ్యవస్థ, తరచూ పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు ఉన్నవారు భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో పండ్లు తీసుకోవడం ద్వారా అసౌకర్యాన్ని తగ్గించుకోవచ్చు. చివరికి పండ్లను ఏ సమయంలో తింటున్నామన్న దానికంటే, వాటిని సరైన పరిమాణంలో, సంపూర్ణ రూపంలో తీసుకోవడం, మన శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం మరింత ముఖ్యమైన విషయమని నిపుణులు చెబుతున్నారు.

# శ్రీలంకతో రెండో టెస్టుకు ముందు కుల్దీప్‌కు గంభీర్ కీలక సూచన!

- వికెట్ల కోసం తొందరపడొద్దని కుల్దీప్‌కు గంభీర్ సూచన
- మంచి స్పెల్‌పై దృష్టి పెట్టాలని సూచించిన గంభీర్
- 20 వికెట్లు తీయగల బౌలింగ్ దళమే లక్ష్యమని వివరణ
- పరిస్థితులకు తగ్గట్టే తుది జట్టును ఎంచుకుంటామని స్పష్టీకరణ
- కుల్దీప్‌ను అత్యంత ప్రమాదకర బౌలర్‌గా అభివర్ణన



**హైదరాబాద్ పెన్ పవర్:** వికెట్లు తీయాలనే ఆత్రుతతో బౌలింగ్ చేయకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని భారత హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సూచించాడు. శ్రీలంకతో ఆదివారం ప్రారంభమయ్యే రెండో టెస్టు నేపథ్యంలో జట్టు కూర్పుపై చర్చ జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశాడు.
గాలేలో జరిగిన తొలి టెస్టులో కుల్దీప్ ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడి స్థానం గురించి చర్చ జరుగుతోంది. జట్టులో సారాంశ్ జైన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ కూడా అందుబాటులో ఉన్నాడు.అయితే టెస్టు మ్యాచ్ గెలవాలంటే 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని ఎంపిక చేస్తామని గంభీర్ స్పష్టం చేశాడు. పరిస్థితులను బట్టి తుది జట్టును నిర్ణయిస్తామని చెప్పాడు.కుల్దీప్‌తో తన చర్చల గురించి మాట్లాడుతూ.. వికెట్ల కోసం అత్యాశ పడకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపాడు. రిస్ట్ స్పిన్నర్లు వికెట్ల కోసం ఆత్రుత పడితే బౌలింగ్‌పై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నాడు.కుల్దీప్ సామర్థ్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని గంభీర్ పేర్కొన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడు ప్రమాదకర బౌలర్‌గా మారగలడని తెలిపాడు. అయితే పరిస్థితులకు అనుగుణంగా ఫలితం ఇచ్చే బౌలింగ్ దళానికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశాడు.గాలే టెస్టు పిచ్‌పై కూడా గంభీర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. స్పిన్నర్లు, పేసర్లు, బ్యాటర్లకు ఆ పిచ్ సహకరించిందని అన్నాడు. ఐదు రోజుల పాటు తీవ్రంగా శ్రమిస్తేనే టెస్టు మ్యాచ్ గెలవగలమని చెప్పాడు.అలాగే ఐదుగురు ప్రధాన బౌలర్లతో ఆడటం జట్టుకు వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని పేర్కొన్నాడు. ఫ్లాట్ పిచ్‌లపై బౌలర్లను రొటేట్ చేసేందుకు ఇది అవకాశం ఇస్తుందని తెలిపాడు.

# 15 ఏళ్ల వైభవ్.. టెస్టుల్లోనూ అదరగొడతాడా? ద్రవిడ్ ఏమన్నాడంటే!

- వైభవ్ టెస్టు క్రికెట్‌కు కొత్త ఊపు తేగలడన్న ద్రవిడ్
- దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరపున ఆడనున్న వైభవ్
- రెడ్‌బాల్ క్రికెట్‌లో వైభవ్‌కు మరింత అనుభవం అవసరమన్న ద్రవిడ్
- వైభవ్ ఎదుగుదలపై ఓపిక అవసరమని ద్రవిడ్ సూచన
- సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ అనధికారిక టెస్టులు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకురాగలడని భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. అయితే 15 ఏళ్ల వైభవ్ ఎదుగుదలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించాడు. అతడికి తగినంత సమయం, అనుభవం ఇవ్వాలని చెప్పాడు.వైభవ్ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరపున ఆడనున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో ఇప్పటికే సత్తా చాటిన అతడికి.. రెడ్‌బాల్ క్రికెట్‌లో నిలకడ సాధించేందుకు ఇది కీలక అవకాశం. 2025 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున వైభవ్‌కు ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరించాడు.వైభవ్ ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అతడి సగటు 17.25గా ఉంది. దేశవాళీ రెడ్‌బాల్ క్రికెట్‌లో ఎక్కువకాలం వరుసగా ఆడే అవకాశం అతడికి ఇప్పటివరకు పెద్దగా దక్కలేదు. దులీప్ ట్రోఫీతో ఆ లోటు తీరే అవకాశం ఉంది. సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ రెండు అనధికారిక టెస్టులు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు కూడా వైభవ్‌కు ఉపయోగపడే అవకాశముంది.టీ20 క్రికెట్‌కు, టెస్టు క్రికెట్‌కు చాలా తేడా ఉంటుందని ద్రవిడ్ పేర్కొన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇన్నింగ్స్‌ను నిర్మించడం, ఒత్తిడిని తట్టుకోవడం, ఎక్కువసేపు ఏకాగ్రతతో బ్యాటింగ్ చేయడం వైభవ్ నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పాడు.వైభవ్ సూర్యవంశీకి ఇంకా 15 ఏళ్లేనని ద్రవిడ్ గుర్తు చేశాడు. అతడి కెరీర్‌లో విజయాలతో పాటు వైఫల్యాలు కూడా వస్తాయని పేర్కొన్నాడు. అందుకే అతడిపై ఓపికతో వ్యవహరించాలని సూచించాడు.టెస్టు క్రికెట్ మనుగడ సాగించాలన్నా, ఎదగాలన్నా మూడు ఫార్మాట్లలో ఆడగల ఆటగాళ్లు అవసరమని ద్రవిడ్ అన్నాడు. వైభవ్ భవిష్యత్తులో భారత్ తరపున టెస్టు ఆటగాడిగా ఎదిగితే ప్రపంచ క్రికెట్‌కే అది ఆసక్తికర పరిణామమవుతుందని పేర్కొన్నాడు.

# ‘లైక్స్, వ్యూస్ కాదు.. ట్రోఫీలే ముఖ్యం’.. గంభీర్ కీలక వ్యాఖ్యలు

- టెస్టుల్లో భారత్ ఇబ్బందుల్లో లేదన్న గంభీర్
- ర్యాంకింగ్స్ కంటే ట్రోఫీలు గెలవడమే లక్ష్యమని స్పష్టీకరణ
- శ్రీలంకపై భారత్ 1-0తో సిరీస్‌లో ఆధిక్యం
- గిల్, పడిక్కల్, సుతార్‌పై గంభీర్ విశ్వాసం
- 20 వికెట్లు తీసే బౌలింగ్ కూర్పే కీలకమని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడొద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టం చేశాడు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పాడు.శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైంది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్‌ల్లో ఓటములు ఎదురయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ అన్నాడు.“మేం టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను పట్టించుకునేది అదే” అని గంభీర్ స్పష్టం చేశాడు.కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తం చేశాడు. కొలంబోలో 20 వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నాడు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నాడు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమని, ఆటగాళ్లకు మరింత సమయం ఇవ్వాలని సూచించాడు. గిల్, పడిక్కల్, సుతార్‌లపై గంభీర్ విశ్వాసం ప్రకటించాడు.
మూడు టెస్టుల సిరీస్‌లకు గంభీర్ మద్దతు తెలిపాడు. తొలి టెస్టులో ఓడిన జట్టుకు పుంజుకునే అవకాశం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో ప్రస్తుత సిరీస్ రెండు టెస్టులకే పరిమితం కావడంతో రెండో మ్యాచ్ ఫలితమే సిరీస్‌ను నిర్ణయించనుంది.






# జెట్ స్పీడ్‌లో ప్రజెట్ స్పీడ్‌లో ప్రభాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!

ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్ట్‌లతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్ట్‌లు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి.ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.ఈ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థలలో ఒకటైన హోంబలే ఫిలిమ్స్ - మైత్రి మూవీ మేకర్స్ సంస్థల్లో ఏదో ఒకటి నిర్మించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే ఈ ప్రొడక్షన్ హౌస్‌లతో ప్రభాస్‌కు మంచి అనుబంధం ఉండటంతో త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందంటున్నారు. మరోవైపు ప్రభాస్ ఖాతాలో ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్న -కల్కి 2-, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -స్పిరిట్-.. అలాగే ప్రశాంత్ నీల్ తో -సలార్ 2- వంటి భారీ చిత్రాలు క్యూలో ఉన్నాయి.ఇలాంటి బిజీ షెడ్యూల్ మధ్యలోనూ మరో కొత్త సినిమాకు డార్లింగ్ డేట్స్ కేటాయించడం ప్రభాస్ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకరి తర్వాత ఒకరుగా క్రేజీ ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్న రెబల్ స్టార్ వేగం చూస్తుంటే రాబోయే రెండు.. మూడేళ్లలో బాక్సాఫీస్ రికార్డులన్నీ డార్లింగ్ పేరిట ఖాయమనిపిస్తోంది. వరుస పాన్-ఇండియా చిత్రాలతో తెలుగు సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా నెక్స్ట్ లెవెల్‌కు తీసుకువెళ్తున్నారు. ప్రభాస్ తో పాటు బన్నీ కూడా అదే రేంజ్ లో కెరీర్ ని ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నారు. ఇదే తరహాలో రామ్ చరణ్, ఎన్టీఆర్, మహేష్ కూడా భవిష్యత్ ప్రాజెక్ట్ లను ప్లాన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే వారంతా కూడా తదుపరి చిత్రాల విషయంలో ఓ నిర్ణయానికి వచ్చారు

భాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!
ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్ట్‌లతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్ట్‌లు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965